తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
13-09-2026
ఆదివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 216
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి
People's Voice
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575



## ముందు బుజ్జగింపులు.. ఆ తర్వాతే ఖాళీల భర్తీ

- మూడు పదవులు..
- వేలాడుతున్న విస్తరణ కత్తి
- చాంతాడంత పోటీ సామాజిక, ప్రాంతీయ సమీకరణాలపై కసరత్తు
- రెడ్డి వర్గం సీనియర్లకు పదవులపై ఆశలు
- బీసీ, ఎస్టీ, లంబాడా వర్గాల నుంచి డిమాండ్లు
- స్థానిక సంస్థల ఎన్నికల వేళ అసమ్మతిపై ఆందోళన
- నామినేటెడ్ పోస్టులతో అసంతృప్తిని చల్లార్చే యోచన

2

# ప్రజల తీర్పును గౌరవించాలంటూ హితవు

- ప్రతిపక్షాలపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు
- అధికారం పోయింది.. అహంకారం పోలేదు
- రాజకీయ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచన
- 'వేపాకులతో కొడతారు' అంటూ చమత్కారం
- పోలేపల్లి జాతర ప్రస్తావనతో సభలో నవ్వులు
- అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య పలుమార్లు వాగ్వాదం

**హైదరాబాద్, సెప్టెంబర్ 12:** శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్షాలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. అధికారం కోల్పోయినా అహంకారం మాత్రం పోలేదంటూ ఆయన విమర్శించారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం కొనసాగుతున్న సమయంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకోవాలని ప్రతిపక్షాలకు సూచించారు.

**అహంకారం వదులుకోవాలంటూ**

అధికారం పోయింది.. కానీ అహంకారం పోలేదంటూ ప్రతిపక్షాలను ఉద్దేశించి సీఎం వ్యాఖ్యానించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలని, రాజకీయంగా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అహంకార ధోరణిని వీడాలని సూచించారు.

మిగతా 2వ పేజీలో..



## క్యూర్ బిల్లుకు మండలి ఆమోదం

- కోర్ అర్బన్ రీజియన్ 2026 బిల్లుకు గ్రీన్‌సిగ్నల్
- హైదరాబాద్ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ నిర్ణయం
- 'ఒకే నగరం.. ఒకే పరిపాలన.. ఒకే చట్టం' నినాదం

2

## మండపాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం

- అతిథులను ఆహ్వానిస్తే కమిషనరేట్‌కు సమాచారం ఇవ్వండి
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి
- గణేష్ ఉత్సవాలపై సీఎం సమీక్ష

3



## నిమ్స్ వైద్యులకు సీఎం అభినందనలు

3



## ఆదిలాబాద్ విమానాశ్రయంపై మరో ముందడుగు

- జేయూపీతో రక్షణ సామర్థ్యాలు మరింత బలోపేతం
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సమక్షంలో సమీక్ష
- డీపీఆర్, మాస్టర్ ప్లాన్‌ను వేగవంతం చేయాలని నిర్ణయం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

2

## రాష్ట్రంలో మూడు రోజులు వర్షా లు

- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :** రాష్ట్రంలో వర్గాలు కొనసాగుతున్నాయని, పలు జిల్లాల్లో మరో వారం రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీచేసింది. ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. వీటితోపాటు నల్గొండ, నాగర్ కర్నూల్, మహబూబ్నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయని తెలిపింది.





## తక్షణమే యూఎన్ఎస్సీ సంస్కరణలు

- ఆలస్యం ఇక ఎంతమాత్రం వద్దు: మోదీ
- నిబంధనలు పాటించేవారిగా కాదు.. రూపొందించేవారిగా మారాలి
- గ్లోబల్ సౌత్‌కు నిర్ణయాధికారం దక్కాలి
- అధికార పిరమిడ్‌ను మార్చాలి
- ఏఐ, సైబర్, బయోటెక్‌లో సహకారం పెంచాలి

3

## 22Aపై చర్చలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

- మంత్రి పొంగులేటి అబద్ధాల ప్రవాహం
- ప్రతిపక్షానికి మైక్ ఇవ్వకుండా సస్పెన్షన్
- తాము అడిగిన ప్రశ్నలకు సమాధానాలేవీ లేవు
- మా మామ భూమిపై అర్ధసత్యాలు చెప్పారు
- రూ.15 కోట్ల విలువంటే.. రూ.50 లక్షలకే తీసుకోండి

2





## మాక్ అసెంబ్లీలో తలసాని సెటైర్లు

- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వినూత్న నిరసన
- సీఎం పాత్రలో తలసాని శ్రీనివాస్ యాదవ్
- స్పీకర్‌గా మాణిక్‌రావు ప్రభుత్వ విధానాలపై వ్యంగ్యాస్త్రాలు
- సస్పెన్షన్లపై చురకలు
- ప్రతిపక్ష గొంతు నొక్కుతున్నారంటూ విమర్శలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 12:** కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు, అసెంబ్లీలో ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారనే ఆరోపణలకు నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శనివారం

మిగతా 2వ పేజీలో..




## అరబ్ దేశాల మధ్య విభేదాలకు తెర

- భారత్ దౌత్యంతో చివరి నిమిషంలో సయోధ్య
- యూఎన్ భద్రతా మండలిలో భారత్‌కు పెద్ద పాత్ర
- స్థానిక కరెన్సీలతో వాణిజ్యానికి ప్రాధాన్యం
- పహల్గాం ఉగ్రదాడిని ఖండించిన బ్రిక్స్
- స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటుకు నిర్ణయం

3

## ఢిల్లీలో మోదీ–జిన్‌పింగ్ భేటీ



- దీర్ఘకాలిక వ్యూహాత్మక ఒప్పందాలకు చైనా సిద్ధం
- భారత్‌తో కలిసి నడవాలి: జిన్‌పింగ్
- ఉమ్మడి అభివృద్ధికి పరస్పర సహకారం
- నిర్మాణాత్మక చర్చలకు భారత్ సిద్ధం: మోదీ
- ఏడేళ్ల తర్వాత భారత్‌కు జిన్‌పింగ్

3




# క్యూర్ బిల్లుకు మండలి ఆమోదం

- కోర్ అర్బన్ రీజియన్ 2026 బిల్లుకు గ్రీన్‌సిగ్నల్
- హైదరాబాద్ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ నిర్ణయం
- 'ఒకే నగరం.. ఒకే పరిపాలన.. ఒకే చట్టం' నినాదం
- మండలిలో మొత్తం నాలుగు బిల్లులకు ఆమోదం
- ఆరు రోజుల పాటు కొనసాగిన శాసనమండలి సమావేశాలు
- 19 గంటల 20 నిమిషాల పాటు మండలి కార్యకలాపాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 12:**

హైదరాబాద్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తీసుకొచ్చిన క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్) 2026 బిల్లుకు తెలంగాణ శాసనమండలి ఆమోదం తెలిపింది. శనివారం మండలిలో బిల్లును ప్రవేశపెట్టగా.. సభ్యులు చర్చించిన అనంతరం ఆమోదించారు. అనంతరం శాసనమండలి నిరవధికంగా వాయిదా పడింది.

**ఒకే పరిపాలన.. ఒకే చట్టం**

హైదరాబాద్ నగర అభివృద్ధి, పరిపాలనను మరింత సమర్థంగా నిర్వహించాలనే ఉద్దేశంతో క్యూర్ 2026 బిల్లును ప్రభుత్వం రూపొందించింది. 'ఒకే నగరం.. ఒకే పరిపాలన.. ఒకే చట్టం' అనే విధానంతో బిల్లుకు రూపకల్పన చేసినట్లు ప్రభుత్వం తెలిపింది.

**నాలుగు బిల్లులకు ఆమోదం**

శనివారం జరిగిన మండలి సమావేశంలో క్యూర్ బిల్లుతోపాటు మొత్తం నాలుగు బిల్లులకు సభ్యులు ఆమోదం తెలిపారు. వివిధ అంశాలపై చర్చించిన అనంతరం బిల్లులకు మండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు.

**ఆరు రోజులు.. 19 గంటల 20 నిమిషాలు**

తెలంగాణ శాసనమండలి మొత్తం ఆరు రోజుల పాటు కార్యకలాపాలు నిర్వహించింది. ఈ కాలంలో 19 గంటల 20 నిమిషాల పాటు సభ కొనసాగినట్లు ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది.

---

# మాక్ అసెంబ్లీలో తలసాని సెటైర్లు

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాత్ర పోషించగా.. ఎమ్మెల్యే మాణిక్‌రావు స్పీకర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు, మంత్రుల వ్యాఖ్యలపై తలసాని సీఎం పాత్రలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

**సస్పెన్షన్లపై చురకలు**

మాక్ అసెంబ్లీలో తలసాని మాట్లాడుతూ.. "కొండా సురేఖ బిడ్డ నా గురించి మాట్లాడింది కాబట్టే ఢిల్లీకి వెళ్లి మూడు రోజులు ఉండి తొక్కి వచ్చాను. ముఖ్యమంత్రినైన నన్ను, అదీ ఓ బీసీ బిడ్డను బర్తరఫ్ చేయక ఏం చేయాలి? కేబినెట్‌లో వేరే వాళ్లు కూడా ఉన్నారుగా.. కొండా సురేఖ బిడ్డ వాళ్ల గురించి కూడా మాట్లాడొచ్చుగా" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

**ప్రతిపక్షాల ప్రశ్నలపై వ్యంగ్యం**

బీఆర్ఎస్ మహిళా నేతలను ఉద్దేశించి తలసాని మాట్లాడుతూ.. "సబితక్క, సునీతక్క అంటే నాకు ఎంతో గౌరవం. కానీ, మీరు ఇవన్నీ సభలో ప్రశ్నిస్తారనే ఉద్దేశంతోనే మిమ్మల్ని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశాను" అంటూ సటైరికల్‌గా వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలను లేవనెత్తకుండా ప్రతిపక్ష సభ్యులపై సస్పెన్షన్ వేటు వేస్తూ మంత్రులు తమ బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు.

**ప్రజల పక్షాన ప్రశ్నిస్తాం**

అసెంబ్లీని ఏకపక్షంగా నడిపిస్తున్నారని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఆరోపించారు. ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకలను భయపెట్టలేరని స్పష్టం చేశారు. ప్రభుత్వ తీరును ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకే మాక్ అసెంబ్లీ నిర్వహించినట్లు తెలిపారు.

---

# మాక్ అసెంబ్లీ.. డెమోక్రసీని మాక్ చేయడమే

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :**



బీఆర్ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఉందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క విమర్శించారు. చట్టసభల పట్ల, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ఆ పార్టీకి ఏ మాత్రం గౌరవం లేదనేది వారి చర్యలతో మరోసారి స్పష్టమైందన్నారు. అసెంబ్లీ లాబీలో మంత్రి సీతక్క శనివారం చిట్ చాట్ చేశారు. ఎర్రవల్లిలో ఎల్పీ సమావేశం నిర్వహించిన బీఆర్ఎస్ నేతలు పార్టీ కార్యాలయంలో మాక్ అసెంబ్లీ నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. అసెంబ్లీకి రావాల్సిన నేతలు పార్టీ కార్యాలయంలో కూర్చుని అసెంబ్లీని అనుకరించడం ప్రజాస్వామ్యాన్ని గౌరవించడమా అని నిలదీశారు. గతంలో ఫామ్‌హౌస్ ముందు దళిత సంఘాలు నిరసన తెలిపినప్పుడు పసుపు నీళ్లతో ఆ ప్రాంతాన్ని శుద్ధి చేసిన ఘటనను మంత్రి సీతక్క గుర్తు చేశారు. ఇంకా ఆ మైల పోలేదనే ఆధిపత్య దురహంకారంతోనే ఫామ్‌హౌస్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించలేదా అని ప్రశ్నించారు. అసెంబ్లీకి ఎలాగూ రాని కేసీఆర్ బీఆర్ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీకి కూడా రాకపోవడం చూస్తుంటే ఆయనకు చట్టసభల పట్ల, సొంత పార్టీ కార్యక్రమాల పట్ల ఎంత గౌరవం ఉందో అర్థమవుతోందని సీతక్క అన్నారు. కేసీఆర్ అధికారంలో ఉంటే సచివాలయానికి రారు.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి రారు అని ఆమె ఎద్దేవా చేశారు. ఫామ్‌హౌస్‌ను సచివాలయంగా, పార్టీ కార్యాలయాన్ని అసెంబ్లీగా భావించే పార్టీ బీఆర్ఎస్ తప్ప దేశంలో మరొకటి లేదని విమర్శించారు. ఫామ్‌హౌస్‌లో ఎల్పీ సమావేశం.. పార్టీ కార్యాలయంలో అసెంబ్లీ సమావేశం.. ఉన్న దగ్గరకే అన్నీ రావాలనుకోవడం దొరల అహంకారానికి నిదర్శనం.. చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లు అధికారం పోయినా దొర అహంకారం మాత్రం ఇంకా పోలేదు అని సీతక్క మండిపడ్డారు. ప్రజలు ఎన్నుకున్న అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాల్సిన బాధ్యత ప్రతిపక్ష పార్టీకి ఉందన్నారు. స్పీకర్‌ను, చట్టసభలను అవమానిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని, ప్రతిపక్ష హోదాను ఊడగొట్టడం ఖాయమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

---

# ప్రజల తీర్పును గౌరవించాలంటూ హితవు

మొదటిపేజీ తరువాయి

**సభలో రేవంత్ చమత్కారం**

చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి తనదైన శైలిలో చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు పూయించాయి. "మన ఊర్లలో అయితే వేపాకులతో కొడతారు అధ్యక్షా" అంటూ చమత్కరించారు. అనంతరం పోలేపల్లి జాతరకు తీసుకెళ్లి కొట్టాలా? అని సరదాగా వ్యాఖ్యానించారు. అలాంటి పరిస్థితుల్లోనైనా జ్ఞానోదయం కలుగుతుందేమో అంటూ వ్యాఖ్యానించడంతో సభలో నవ్వులు వెల్లువెత్తాయి. అధికార పక్ష సభ్యులు ఈ వ్యాఖ్యలను హర్షించారు.

**వాగ్వాదాల మధ్య వ్యాఖ్యలు**

శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య పలుమార్లు వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు సభలో ప్రత్యేక చర్చకు దారితీశాయి. ప్రజల తీర్పు, తాజా రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై అధికార పక్షం సమర్థన వ్యక్తం చేస్తుండగా.. ప్రతిపక్షాలు తమదైన రీతిలో స్పందిస్తున్నాయి. దీంతో అసెంబ్లీ సమావేశాల్లో సీఎం వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు కారణమయ్యాయి.

---

# వేలాడుతున్న విస్తరణ కత్తి

**హైదరాబాద్, సెప్టెంబర్ 12:**

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మంత్రివర్గ విస్తరణ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలతో కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడంతో, ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఖాళీగా ఉన్న రెండు స్థానాలకు అదనంగా మరో పదవి ఖాళీ అయింది. దీంతో మొత్తం మూడు మంత్రి పదవులను భర్తీ చేయాల్సి ఉంది. అయితే ఈ పదవుల కోసం ఆశావహుల పోటీ, సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ ప్రాతినిధ్య డిమాండ్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కొత్త సవాళ్లు విసురుతున్నాయి. ఎవరికి అవకాశం కల్పించినా మరికొందరిలో అసంతృప్తి రేగే ప్రమాదం ఉండటంతో, విస్తరణకు ముందే ఆశావహులను బుజ్జగించడంపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి సారించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**రెడ్డి వర్గం సీనియర్లకు ఆశలు**

మంత్రివర్గంలో చోటు కోసం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి వంటి సీనియర్ నేతలు ప్రయత్నిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ముఖ్యమంత్రితో సహా ఇప్పటికే కేబినెట్‌లో రెడ్డి సామాజిక వర్గానికి గణనీయమైన ప్రాతినిధ్యం ఉంది. ఈ నేపథ్యంలో మిగిలిన మూడు స్థానాల్లోనూ అదే వర్గానికి అవకాశం కల్పిస్తే బీసీ, ఎస్టీ, లంబాడా వర్గాల్లో అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉంది. మరోవైపు సీనియర్ రెడ్డి నేతలను పక్కనపెడితే, వారు నేరుగా సీఎం రేవంత్ రెడ్డినే లక్ష్యంగా చేసుకుని అసమ్మతి వ్యక్తం చేసే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**ప్రాంతీయ సమీకరణాలూ కీలకమే**

ఉమ్మడి నిజామాబాద్, హైదరాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి ప్రస్తుతం మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడంతో ఆయా ప్రాంతాల నేతలు పదవులను ఆశిస్తున్నారు. కొండా సురేఖ నిష్క్రమణతో బీసీ సామాజిక వర్గానికి చెందిన స్థానం ఖాళీ కావడం కూడా సామాజిక సమతుల్యతను కాపాడాల్సిన అవసరాన్ని పెంచింది. బీసీ కోటాలో ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య పేర్లు వినిపిస్తుండగా.. ఎస్టీ లంబాడా వర్గం నుంచి బాలు నాయక్, రామచంద్రు నాయక్ ఆశావహులుగా ఉన్నట్లు తెలుస్తోంది. మూడు పదవుల భర్తీలో సామాజిక, ప్రాంతీయ సమీకరణాలను సమన్వయం చేయడం అధిష్ఠానానికి సవాలుగా మారింది.

**ముందు బుజ్జగింపులపైనే దృష్టి**

రాబోయే స్థానిక సంస్థల, కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో పార్టీలో అంతర్గత విభేదాలు తలెత్తడం కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. పదవులు దక్కని సీనియర్లు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తే, ఆ పరిణామం బీఆర్ఎస్, బీజేపీలకు రాజకీయ ఆయుధంగా మారవచ్చు. దీంతో తొందరపడి విస్తరణ చేపట్టి కొత్త వివాదాలకు తెరతీయడం కంటే.. ముందుగా ఆశావహులను సముదాయించడంపైనే రేవంత్ దృష్టి సారించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, ఇతర నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం కల్పించడం ద్వారా అసంతృప్తిని చల్లార్చే ప్రయత్నాలు జరగవచ్చని భావిస్తున్నారు.

**ఆ తర్వాతే కేబినెట్ విస్తరణ**

ఆశావహుల అసంతృప్తిని కొంతమేర తగ్గించిన తర్వాతే మంత్రివర్గ విస్తరణపై ముందడుగు వేయాలని రేవంత్ భావించే అవకాశం ఉంది. హైకమాండ్ ఆమోదం లభించినా, పదవులు దక్కని నేతలను దారికి తీసుకురావడం, సామాజిక సమతుల్యతను కాపాడటం ఆయన నాయకత్వానికి పరీక్షగా నిలవనుంది. మూడు పదవుల కోసం పోటీ పడుతున్న ఆశావహులు అధిష్ఠానం సూచనలకు అనుగుణంగా వ్యవహరిస్తారా? లేక అసమ్మతి గళం వినిపిస్తారా? అన్నది ఇప్పుడు కాంగ్రెస్‌లో ఆసక్తికరంగా మారింది.

---

# ఆదిలాబాద్ విమానాశ్రయంపై మరో ముందడుగు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 :**

వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఆదిలాబాద్ ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో తాను శనివారం సమావేశమైనట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష నిర్వహించామన్నారు. ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు అమలును వేగవంతం చేయడంతోపాటు ఈ కార్యాచరణను మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు రక్షణ శాఖ, పౌరవిమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వం నుంచి ఒక్కో నోడల్ ఆఫీసర్‌ను వచ్చే వారంలోగా ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. దీంతోపాటు జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్(జేయూఏ)కు సంబంధించిన డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పనను వేగవంతం చేయాలని కూడా నిర్ణయించామన్నారు. ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా ఉత్తర తెలంగాణ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని, ఆదిలాబాద్ విమానాశ్రయం కోసం ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు.. వరుస సమావేశాలు, లేఖలు, నిరంతర సమన్వయం.. ఇవాళ తుది దశకు చేరుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఉత్తర తెలంగాణ కనెక్టివిటీ విషయంలో దేశ రక్షణపరంగా వ్యూహాత్మక ప్రాంతమైన ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటు, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఏర్పాటు అవసరాన్ని వివరిస్తూ రీజనల్ కనెక్టివిటీని మెరుగుపరచాల్సిన అంశాన్ని రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. దీనిపై స్పందించిన ఆయన ఆదిలాబాద్‌లో జేయ□ఏను అభివృద్ధి చేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ సిద్ధంగా ఉందని, ఇందుకు అవసరమైన సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని చెప్పారన్నారు. కాగా, ఈ ఎయిర్‌పోర్టుకు సంబంధించి రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల మధ్య పలు సమావేశాలు జరిగాయి. ఇందులో భాగంగా రక్షణ, పౌర విమానయాన అధికారులు ఏప్రిల్ 17న ఆదిలాబాద్ వియానాశ్రయ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంలో 2.75 కిలోమీటర్ల రన్ వే నిర్మాణం అవసరమని నిర్ణయించారు. దీంతోపాట□ ఐఏఎఫ్ వద్ద 369.45 ఎకరాల భూమికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించారు. ఇందులో ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, విజిటింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ పార్కింగ్, వెదర్ షెల్టర్స్, ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాంగర్స్, ఆపరేషనల్ కాంప్లెక్స్, ట్రైనింగ్ ఫెసిలిటీస్, మెయింటెనెన్స్ ఇన్‌ఫ్రా సదుపాయాలను కల్పిస్తామన్నారు. పౌర సేవలకు సంబంధించి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ (ఏఏఐ) ఒక సివిల్ టెర్మినల్‌తోపాటు మెయింటెనెన్స్ అండ్ రిపేర్ ఆపరేషన్స్ (ఎమ్మార్వో) సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తుంది. వీటితోపాటు ఎయిర్‌ఫోర్స్ సిబ్బందికి నివాస, ఇతర మౌలిక సదుపాయాలను కూడా ఏర్పాటు చేస్తారు.

---

# రాజీనామా చేయాల్సింది ఎవరు?

- రూపాయి జీతంతో పేదల కోసం పనిచేస్తున్న నేనా..
- అసెంబ్లీకి రాకుండా ఫార్మ్ హౌస్‌లో ఉన్న కేసీఆరా
- పొంగులేటి.. పొంగు' అంటూ ఎందుకు భయపడుతున్నారు
- మాజీ మంత్రి హరీష్ రావును ప్రశ్నించిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, సెప్టెంబర్ 13 :**

ప్రతిపక్షాలు 22ఏ భూముల అంశాన్ని అడ్డుపెట్టుకుని చేస్తున్న రాజకీయ ఆరోపణలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఎక్స్ వేదికగా మండిపడ్డారు. ప్రజల భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటే అసత్య ప్రచారాలతో ప్రభుత్వాన్ని, తనను లక్ష్యంగా చేసుకోవడం ఎందుకని ప్రశ్నించారు. చీము, నెత్తురు, సిగ్గు, శరం ఉంటే రాజీనామా చేయాలని నన్ను అడుగుతున్నారు.. మరి ప్రజాధనంతో ఇన్నేళ్లు అధికారాన్ని అనుభవించి ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన వారు రాజీనామా చేయొద్దా అని మంత్రి నిలదీశారు. తాను ప్రతి నెలా ఒక్క రూపాయి జీతం మాత్రమే తీసుకుంటూ పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ టవర్స్ నిర్మాణంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్నానని తెలిపారు. 'ప్రజల కోసం పనిచేస్తున్న నన్ను రాజీనామా చేయమంటారా' అని ప్రశ్నించారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి రూ.21 కోట్లT పొంది అసెంబ్లీకి, ప్రజలకు మొఖం చాటేసిన కే.సీ.ఆర్ రాజీనామా చేయరా అని హరీష్ రావును ప్రశించారు.

**అధికారంలో ఉంటే అవినీతి.. ప్రతిపక్షంలో ఉంటే బ్లాక్‌మెయిల్**

'అధికారంలో ఉంటే అవినీతి.. ప్రతిపక్షంలో ఉంటే బ్లాక్‌మెయిల్. ఇప్పుడు చేస్తున్నది కూడా అదే. మీ బ్లాక్‌మెయిల్‌కు, తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రభుత్వం ఇది కాదు' అని స్పష్టం చేశారు. తన పేరును పదేపదే ప్రస్తావిస్తూ



'పొంగులేటి.. పొంగు' అంటూ ప్రతిపక్ష నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై మంత్రి ఘాటుగా స్పందించారు.' పొంగులేటి.. పొంగు అని ఎందుకు పదేపదే అంటున్నారు.. ఎందుకు అంత భయం.. శుభకార్యంలో పాలు పొంగితే శుభం. కానీ గోదావరి, కృష్ణా నదులు ఉగ్రరూపంలో పొంగితే ఆ పొంగులో మీరే కాదు.. మీ పార్టీ కూడా నామరూపాలు లేకుండా పోతుంది' అని వ్యాఖ్యానించారు

---

# 22Aపై చర్చలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

**హైదరాబాద్, సెప్టెంబర్ 13:**

శాసనసభలో 22A నిబంధనలపై జరిగిన చర్చతో ప్రజలకు ఎలాంటి ఉపశమనం లభించలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. సభ సాక్షిగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అబద్ధాల ప్రవాహాన్ని పారించారని మండిపడ్డారు. 22A అక్రమాలపై ప్రతిపక్షం నిలదీస్తుందనే భయంతోనే తమకు మైక్ ఇవ్వకుండా ఏకపక్షంగా సస్పెండ్ చేశారని ఆరోపించారు. తమను సభ నుంచి బయటకు పంపిన తర్వాత మంత్రి సుదీర్ఘ ప్రసంగంతో ఎదురుదాడికి దిగారే తప్ప, తాము లేవనెత్తిన ఏ ఒక్క ప్రశ్నకూ సమాధానం ఇవ్వలేకపోయారని అన్నారు.

**సభను పక్కదోవ పట్టించారు..**

**క్షమాపణ చెప్పలేదు**

22A జాబితా కారణంగా రాష్ట్రంలో ఎన్ని లక్షల మంది ప్రజల ఆస్తులు నిలిచిపోయాయో స్పష్టం చేయాలని తాము ప్రశ్నించినా ప్రభుత్వం సమాధానం దాటవేసిందని హరీశ్ రావు అన్నారు. అయితే, జాబితాను సక్రమంగా పరిశీలించకుండానే భూములను 22Aలో చేర్చామని మంత్రి చెప్పడం ద్వారా తప్పు జరిగిన విషయాన్ని సభలోనే అంగీకరించారని గుర్తు చేశారు. పొరపాటు జరిగిందని ఒప్పుకున్న మంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పకపోగా తమపై ఎదురుదాడి చేయడం విచారకరమన్నారు. ముఖ్యమంత్రి ఇంటిని మాత్రం రాత్రికి రాత్రే 22A నిషేధిత జాబితా నుంచి తొలగించుకున్నారని, ఇదేనా ప్రజా ప్రభుత్వ పాలన అని ప్రశ్నించారు.

**మా మామ భూమిపై అవాస్తవాలు**

తమ కుటుంబ సభ్యుల భూములకు సంబంధించి మంత్రి పొంగులేటి సభలో అర్ధసత్యాలు మాట్లాడారని హరీశ్ రావు ఖండించారు. తన మామగారి భూమి గజ్వేల్ నియోజకవర్గంలో ఉంటే.. సిద్దిపేటలో ఉందంటూ మంత్రి తప్పుగా ప్రచారం చేశారని తెలిపారు. ఆ భూమికి 2010లోనే ఎన్ఓసీ వచ్చిందని, చెక్కుల ద్వారా చట్టబద్ధంగా లావాదేవీలు నిర్వహించి రిజిస్ట్రేషన్ చేసుకున్నామని స్పష్టం చేశారు.

ఎకరా రూ.15 కోట్ల విలువ అంటూ మంత్రి సభను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. నిజంగా అంత విలువ ఉంటే ఎకరాను రూ.50 లక్షలకే ఇస్తామని, మంత్రి పొంగులేటినే వచ్చి కొనుగోలు చేయాలని సవాల్ విసిరారు.

**తెలంగాణ ఉద్యమకారులను అవమానించడమే**

తనను 'అగ్గిపెట్టె రావు' అంటూ మంత్రి పొంగులేటి సంబోధించడంపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రి పొంగులేటికి తెలంగాణ ఉద్యమ చరిత్ర, దాని తీవ్రత ఏమాత్రం తెలియదని విమర్శించారు. తాము ఉద్యమం చేసిన రోజుల్లో భవిష్యత్తులో ఎమ్మెల్యేలు కావాలనే ఉద్దేశంతో పోరాటాలు చేయలేదని స్పష్టం చేశారు. ఉద్యమంలో భాగస్వాములైన వారిని, ఉద్యమకారులను ఇలాంటి వ్యాఖ్యలతో సంబోధించడం తెలంగాణ సమాజాన్ని, ఉద్యమ పోరాట స్ఫూర్తిని అవమానించడమేనని హరీశ్ రావు ధ్వజమెత్తారు.

# మండపాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :**

దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మండప నిర్వాహకులు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలని సూచించారు. భాగ్యనగరంలో గణేశ్ ఉత్సవాల వేళ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఏ చిన్న ఇబ్బంది కలగకుండా సహాయ సహకారాలు అందించాలన్నారు. హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవాలపై శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో సీఎం రేవంత్ రెడ్డి శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత గత సంప్రదాయాన్ని పునరుద్ధరించామని, మీ సమస్యలు తెలుసుకునేందుకు స్వయంగా తానే సమీక్ష నిర్వహిస్తున్నానని చెప్పారు. మండపాలకు అతిథులను ఆహ్వానిస్తే నిర్వాహకులు ఆ వివరాలను స్థానిక కమిషనరేట్‌కు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఊహించని పరిణామాలు జరిగినపుడు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు ఆ సమాచారం ఉపయోగపడుతుందన్నారు. ఎక్కడెక్కడ మండపాలు ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే సమాచారం అందిస్తే పోలీసులకు ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణకు సులభంగా ఉంటుందని ఆయన చెప్పారు. అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మలకు ఏర్పాటు చేసినట్లే గణేశ్ నిమజ్జనాలకు అనుగుణంగా నిర్మాణ సమయంలోనే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెరువుల వద్ద చుట్టూ క్రేన్స్ ఏర్పాటుకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకుని పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. హైదరాబాద్ ప్రశాంతంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయంటూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత వహించాలన్నారు. ఇందుకు నిర్వాహకుల నుంచి సహకారం ఉండాలని కోరారు. సమస్యలు ఏమున్నా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉత్సవ సమితులకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్, జీహెచఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ కమిషనర్లు, హైడ్రా కమిషనర్, పోలీసు ఉన్నతాధికారులు, అధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# తక్షణమే యూఎన్ఎస్‌సీ సంస్కరణలు

- **ఆలస్యం ఇక ఎంతమాత్రం వద్దు: మోదీ**
- **నిబంధనలు పాటించేవారిగా కాదు.. రూపొందించేవారిగా మారాలి**
- **గ్లోబల్ సౌత్‌కు నిర్ణయాధికారం దక్కాలి**
- **అధికార పిరమిడ్‌ను మార్చాలి**
- **ఏఐ, సైబర్, బయోటెక్‌లో సహకారం పెంచాలి**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12:**

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సీ)లో తక్షణమే సంస్కరణలు చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఈ విషయంలో ఇక ఎలాంటి జాప్యానికీ తావులేదని స్పష్టం చేశారు. ఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు అధ్యక్షత వహించిన మోదీ.. గ్లోబల్ సౌత్ దేశాలు ఇతరులు రూపొందించిన నిబంధనలను పాటించేవారిగా కాకుండా, ప్రపంచ నిర్ణయాలను ప్రభావితం చేసే శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సంఘర్షణలకు ఉమ్మడి పరిష్కారాలు చూపాల్సిన బాధ్యత బ్రిక్స్‌పై ఉందన్నారు. ఈ చారిత్రక మార్పుకు నాయకత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రకటించారు.

**నిర్ణయాధికారం కొన్ని దేశాలకే ఎందుకు?**

బ్రిక్స్ ఏర్పడి రెండు దశాబ్దాలు పూర్తయిన నేపథ్యంలో ప్రపంచ వేదికపై కూటమి ప్రత్యేక స్థానం సంపాదించిందని మోదీ తెలిపారు. కష్టకాలంలో ఉమ్మడి బాధ్యత తీసుకుంటూ, పరస్పర సహకారంతో సభ్యదేశాల ప్రజలకు మరింత అభివృద్ధిపై భరోసా కల్పించాలన్నారు. ప్రపంచ సవాళ్ల పరిష్కారంలో గ్లోబల్



సౌత్ దేశాలు ముందువరుసలో ఉంటున్నప్పటికీ.. అంతర్జాతీయ నిర్ణయాలు తీసుకునే సమయంలో మాత్రం వెనుకబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత అంతర్జాతీయ పాలనా వ్యవస్థ పిరమిడ్ ఆకారంలో ఉందని, అధికారం కొద్దిపాటి దేశాల వద్దే కేంద్రీకృతమైందని విమర్శించారు. కింది స్థాయిలో ఉన్న దేశాలు నిర్ణయాల ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాయే తప్ప.. వాటిని ప్రభావితం చేయలేకపోతున్నాయని పేర్కొన్నారు.

**సమాన హక్కులతో భాగస్వామ్య వేదిక**

అధికార పిరమిడ్ వ్యవస్థకు ముగింపు పలికి ప్రతి దేశానికి సమాన హక్కులు, స్పష్టమైన ప్రాతినిధ్యం కల్పించే భాగస్వామ్య వ్యవస్థను తీసుకురావాలని మోదీ సూచించారు. బ్రిక్స్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ పాలనా వ్యవస్థలో సమగ్ర సంస్కరణల కోసం సభ్యదేశాలు ఏకతాటిపైకి రావాలని కోరారు. అంతర్జాతీయ సమస్యలకు పరిష్కారాలు అన్వేషించే ప్రతి అడుగులో మానవాభివృద్ధే కేంద్ర బిందువుగా ఉండాలని స్పష్టం చేశారు. ఏఐ, సైబర్‌స్పేస్, బయోటెక్నాలజీ రంగాల్లో సభ్యదేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత పెంచుకోవాలని పిలుపునిచ్చారు.

# ఢిల్లీలో మోదీ–జిన్‌పింగ్ భేటీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13:**

బ్రిక్స్ సదస్సు కోసం ఢిల్లీకి వచ్చిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. భారత మండపంలో జరిగిన ఈ సమావేశంలో సరిహద్దు వివాదం, వాణిజ్యం సహా పలు ద్వైపాక్షిక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. అనంతరం భారత్‌తో దీర్ఘకాలిక, వ్యూహాత్మక ఒప్పందాలను కొనసాగిస్తామని జిన్‌పింగ్ తెలిపారు. ప్రపంచంలో అతిపెద్ద దేశాలైన భారత్, చైనాలు కలిసి పనిచేస్తూ పరస్పరం సహకరించుకోవాలని పిలుపునిచ్చారు.

**మోదీని కలవడం ఆనందంగా ఉంది**

ద్వైపాక్షిక సంబంధాల దీర్ఘకాలిక అభివృద్ధిని వ్యూహాత్మక దృష్టితో ముందుకు తీసుకెళ్లడం వల్లే భారత్-చైనా సంబంధాలు పురోగమించాయని జిన్‌పింగ్ అన్నారు. ఇరు దేశాలు భిన్నమైనవే అయినప్పటికీ ఉమ్మడి అభివృద్ధి కోసం పరస్పరం మద్దతు ఇచ్చుకున్నాయని తెలిపారు. ఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సుకు హాజరు



కావడం, ప్రధాని మోదీని మరోసారి కలవడం ఆనందంగా ఉందన్నారు. భారత్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు విజయవంతం కావడంపై మోదీకి అభినందనలు తెలిపారు.

**ఇరుదేశాలు ఉమ్మడిగా అభివృద్ధి చెందాలి**

గత 12 ఏళ్లలో ఢిల్లీకి రావడం తనకు ఇది రెండోసారని జిన్‌పింగ్ గుర్తుచేశారు. ఈ కాలంలో మోదీని 21 సార్లు కలిశానని తెలిపారు. ఈ సమావేశాల ద్వారా ఇరు దేశాల మధ్య అనేక అంశాల్లో ఏకాభిప్రాయాలు కుదిరాయని చెప్పారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాలుగా, గ్లోబల్ సౌత్‌లో కీలక సభ్యులుగా భారత్, చైనాలకు మానవాళి ఉమ్మడి భవిష్యత్తు కోసం ప్రత్యేక బాధ్యతలు ఉన్నాయని పేర్కొన్నారు. ఒకరి సామర్థ్యాల నుంచి మరొకరు నేర్చుకుంటూ ఉమ్మడి అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. నాణ్యమైన సహకారాన్ని కొనసాగిస్తూ సమానత్వం, సమ్మిళితత్వం, స్వేచ్ఛాయుత ఆర్థిక వ్యవస్థ కోసం కలిసి పనిచేయాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని వేగంగా పురోగతి సాధించాలని అన్నారు.

**నిర్మాణాత్మక చర్చలకు భారత్ సిద్ధం**

జిన్‌పింగ్‌తో సమావేశం అనంతరం మోదీ మాట్లాడుతూ బ్రిక్స్ సదస్సుకు చైనా అందించిన మద్దతు, సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ద్వైపాక్షిక సహకారానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించే అవకాశం లభించిందన్నారు. నిర్మాణాత్మక చర్చలకు భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. బ్రిక్స్ సదస్సులో జిన్‌పింగ్ చేసిన సానుకూల వ్యాఖ్యలకు ధన్యవాదాలు తెలిపారు.

**ఏడేళ్ల తర్వాత భారత్‌కు జిన్‌పింగ్**

2019లో చివరిసారిగా భారత్‌లో పర్యటించిన జిన్‌పింగ్.. ఏడేళ్ల విరామం తర్వాత మళ్లీ దేశానికి వచ్చారు. అంతకుముందు 2014, 2016లో ఆయన భారత్‌లో పర్యటించారు. 2020లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణల తర్వాత భారత్-చైనా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో 2019 తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రాలేదు. తాజాగా బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో ఆయన ఢిల్లీకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# అరబ్ దేశాల మధ్య విభేదాలకు తెర

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12:**

బ్రిక్స్ సభ్యదేశాల ఆమోదంతో ఢిల్లీ డిక్లరేషన్‌కు ఏకాభిప్రాయం లభించిందని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రకటించారు. భారత్ దౌత్య ప్రయత్నాల ఫలితంగా పశ్చిమాసియా సంక్షోభంపై విభేదాలు ఉన్న ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా సైతం ఉమ్మడి ప్రకటనకు ఆమోదం తెలిపాయి. ప్రారంభంలో ఇరాన్, యూఏఈలు కఠిన వైఖరి అవలంబించడంతో చర్చలు చివరి నిమిషం వరకు ఉత్కంఠభరితంగా సాగాయి. బ్రిక్స్ ఏకాభిప్రాయంతో పనిచేసే కూటమి కావడంతో ఏ ఒక్క దేశం వ్యతిరేకించినా ప్రకటన నిలిచిపోయే పరిస్థితి ఉండేది. వరుసగా జరిగిన తెరవెనుక చర్చలతో ప్రతిష్టంభన తొలగి, సభ్యదేశాలన్నీ సంయుక్త ప్రకటనకు ఆమోదం తెలిపాయి.

**పాత వ్యవస్థలు ఇక పనికిరావు**

సదస్సు ముగింపు ప్రసంగంలో మోదీ మాట్లాడుతూ మారుతున్న ప్రపంచాన్ని పాతబడిపోయిన వ్యవస్థలు నడపలేవని అన్నారు. ప్రాతినిధ్యం, స్పందన, నిబంధనల రూపకల్పనలో సంస్కరణలు అవసరమని స్పష్టం చేశారు. భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి, వాటి నియంత్రణకు సంబంధించిన నిబంధనల రూపకల్పనలో గ్లోబల్ సౌత్ దేశాలకు సమాన భాగస్వామ్యం ఉండాలని పేర్కొన్నారు. నిర్ణయాలు, వాటి ఫలితాల మధ్య ఉన్న అంతరాన్ని భాగస్వామ్యం, ఉమ్మడి కార్యాచరణతోనే పూడ్చగలమన్నారు. ఢిల్లీ డిక్లరేషన్ ఉమ్మడి సంకల్పానికి దిశానిర్దేశం చేస్తుందని, తీర్మానాలను ఆచరణాత్మక ఫలితాలుగా మార్చాల్సిన బాధ్యత సభ్యదేశాలపై ఉందని తెలిపారు.




**యూఎన్ భద్రతా మండలిలో భారత్‌కు మద్దతు**

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టాలని ఢిల్లీ డిక్లరేషన్ ఆకాంక్షించింది. ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలకు మెరుగైన ప్రాతినిధ్యం కల్పించాలని సూచించింది. భద్రతా మండలిలో భారత్, బ్రెజిల్‌కు మరింత పెద్ద పాత్ర దక్కాలన్న డిమాండ్‌కు శాశ్వత సభ్యదేశాలైన చైనా, రష్యాలు మద్దతు పునరుద్ఘాటించాయి. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలని బ్రిక్స్ కోరింది.

**స్థానిక కరెన్సీలతో వాణిజ్యానికి ప్రాధాన్యం**

బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యంలో డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించి, స్థానిక కరెన్సీల వినియోగాన్ని పెంచాలని డిక్లరేషన్ పేర్కొంది. సరిహద్దు చెల్లింపులకు ఆచరణాత్మక పరిష్కారాలను సులభతరం చేయాలని సూచించింది. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా విధిస్తున్న సుంకాలు, బలవంతపు చర్యలపై ఆందోళన వ్యక్తం చేసింది.

**పహల్గాం దాడిని ఖండించిన బ్రిక్స్**

ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ ప్రదర్శించాలని బ్రిక్స్ పిలుపునిచ్చింది. పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ సరిహద్దు ఉగ్రవాదం, ఉగ్ర నిధులను అరికట్టాలని స్పష్టం చేసింది. ఉగ్రవాద నిర్మూలనలో ద్వంద్వ వైఖరిని వీడాలని కోరింది. అణు కేంద్రాలపై దాడులు, పెరుగుతున్న అణ్వస్త్ర ప్రమాదాలను కూడా ఖండించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందాల్సిన నిధులు పక్కదారి పడుతుండగా ప్రపంచ సైనిక వ్యయం పెరగడంపై విచారం వ్యక్తం చేసింది.

**శిలాజ ఇంధనాల అవసరం గుర్తింపు**

అభివృద్ధి చెందుతున్నదేశాలకు శిలాజ ఇంధనాలు ఇంకా అవసరమేనని డిక్లరేషన్ పేర్కొంది. అదే సమయంలో పర్యావరణ అనుకూల ఇంధనాల వైపు మారాలని సూచించింది. ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటు చేయాలని సభ్యదేశాలు నిర్ణయించాయి. ఆర్థిక, సామాజిక వృద్ధిలో మహిళలు నిర్ణయాధికారులుగా కీలక పాత్ర పోషించాలని న్యూఢిల్లీ డిక్లరేషన్ గుర్తించింది.

## నిమ్స్ వైద్యులకు సీఎం అభినందనలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :**

నిమ్స్‌లో పీడియాట్రిక్ కార్డియాక్ సర్జరీ క్యాంప్ విజయవంతంగా పూర్తయిన సందర్భంగా వైద్యులు డి.రమణ ధన్నపునేని, ఎం.అమరేష్ రావులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 6 నుంచి 12 వ తేదీ వరకు క్యాంపును నిర్వహించగా పుట్టుకతో గుండె జబ్బులతో బాధపడుతున్న 19మంది చిన్నారులకు శస్త్రచికిత్సలు చేశారు. ఇందులో కేవలం రెండు కిలోల బరువున్న రెండు నెలల పసికందుకు విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తి చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైద్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు.

## డిసెంబర్ 2027కు నాగపూర్ వరంగల్ హైవే పూర్తి

- **మండలిలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :**



నాగ్‌పూర్‌మంచిర్యాలవరంగల్‌ఖమ్మంవిజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే చాలా ముఖ్యమైన రహదారి అని, మొత్తం 310 కి.మీ పొడవు ఉన్న ఈ ప్రాజెక్టులో 280 కి.మీ తెలంగాణలోనే ఉందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శాసన మండలిలో సభ్యులు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరామ్‌లు శనివారం అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. ఈ రహదారి నాలుగైదు జిల్లాలను కలుపుతూ తెలంగాణ నుంచి నాగ్‌పూర్, విజయవాడ వైపు ప్రయాణించే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మంచిర్యాలవరంగల్ రహదారిని ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిచారని, 2023 మార్చి 31న ఎల్‌వోఏ ఇచ్చి మే 23న అగ్రిమెంట్ జరిగిందని చెప్పారు. మొదట 730 రోజుల్లో అంటే రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారని, అయితే భూసేకరణ, కోర్టు కేసులు, ఇతర కారణాల వల్ల పనుల్లో ఆలస్యం జరిగిందని వివరించారు. భూసేకరణలో దాదాపు మొత్తం సమస్యలు పరిష్కరించామని, చిన్న చిన్న సమస్యలతో కొంత భూమి మాత్రమే పెండింగ్‌లో ఉందని చెప్పారు. ఆలస్యం కారణంగా కాంట్రాక్టర్‌కు ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్ ఇచ్చి 2027 డిసెంబర్ 31నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని నిర్ణయించామన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా మే 26న ఈ ప్రాజెక్టుపై ప్రత్యేకంగా సమీక్షించారన్నారు. తెలంగాణకు ఈ రహదారి ఎంతో ముఖ్యమని, ముఖ్యంగా నాగ్‌పూర్‌కు వెళ్లే ప్రజలకు ఉపయోగకరమని చెప్పారు. భూసేకరణ విషయంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగదన్నారు. వారికి మార్కెట్ రేటు ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని, కోదండరామ్ లేవనెత్తిన భూసేకరణ సమస్యలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందని చెప్పారు. ప్రస్తుతం ఒకటి రెండుచోట్ల మాత్రమే భూమి అప్పగింత పెండింగ్‌లో ఉందన్నారు. ఒకచోట సుమారు 1 నుంచి 1.30 కిలోమీటర్లు, మరో ప్యాకేజీలో 5.7 కిలోమీటర్ల మేర సమస్య ఉందని, దాన్ని కూడా త్వరలో పరిష్కరిస్తామని అన్నారు. భూసేకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది కాగా, నిర్మాణ పనులు మొత్తం ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నోడల్ ఏజెన్సీగా ఎన్‌హెచ్‌ఏఐకి పూర్తి సహకారం అందిస్తోందన్నారు. ఆ అధికారులతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు ఇస్తామన్నారు. 31 డిసెంబర్ 2027 నాటికి ఈ కీలక రహదారి ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామని సభ్యులందరికీ తెలియజేస్తున్నామని మంత్రి వెంకటరెడ్డి చెప్పారు.

## విజయ డెయిరీని బలోపేతం చేస్తాం

- **పాల సేకరణలో తాత్కాలిక తగ్గుదల**
- **పాడి రైతులకు ఎలాంటి బకాయిలు లేవు**
- **శాసనమండలిలో మంత్రి వాకిటి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :**

విజయ డెయిరీని మరింత బలోపేతం చేసి పాడి రైతులకు అండగా నిలిచేందుకు ప్రజా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య శాఖల మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. శాసనమండలిలో విజయ డెయిరీ పాల సేకరణకు సంబంధించిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. విజయ డెయిరీ పాల సేకరణలో తాత్కాలికంగా స్వల్ప తగ్గుదల నమోదైందంటూ దీర్ఘకాలంగా కొనసాగిన లీన్ సీజన్ కారణంగానే ఈ తగ్గుదల ఏర్పడిందని వివరించారు. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో విజయ డెయిరీ రోజువారీ సగటు పాల సేకరణ వివరాలను మంత్రి వెల్లడించారు. ఏప్రిల్ 2023 - మార్చి 2024 కాలంలో రోజుకు 3.60 లక్షల లీటర్లు, ఏప్రిల్ 2024మార్చి 2025 కాలంలో రోజుకు 4 లక్షల లీటర్లు, ఏప్రిల్ 2025మార్చి 2026లో రోజుకు 3.36 లక్షల లీటర్లు సేకరించినట్లు తెలిపారు. పాడి రంగంలో రైతులకు మరింత భరోసా కల్పించడంతోపాటు విజయ డెయిరీని ఆధునికీకరించడం, పాల ఉత్పత్తుల మార్కెటింగ్‌ను పెంచడం, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించడం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. పాడి రైతులకు చెల్లించాల్సిన పాల సేకరణ బకాయిలు ఏవీ లేవని మంత్రి స్పష్టం చేశారు. రైతుల నుంచి సేకరించిన పాలకు సంబంధించి ప్రభుత్వం, విజయ డెయిరీ చెల్లింపుల విషయంలో ఎలాంటి బకాయిలు లేవని తెలిపారు. రాష్ట్రంలోని పాడి రైతులకు దేశంలోనే అత్యధిక ధర చెల్లిస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం కృత్రిమ పనీరును నిషేధించిందని, విజయ డెయిరీ కేవలం పాలతో తయారు చేసే పనీరును విక్రయిస్తోందని తెలిపారు. విజయ డెయిరీకి ఆదాయం పెంచే విధంగా ఆయా స్థలాల్లో పెట్రోల్ బంకులు, షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. పశు వైద్య శాఖలో 110మంది వైద్యులను, 304 మంది కాంపౌండర్లను నియమించామని తెలిపారు. రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి పాడి గేదెలను పంపిణీ చేసి పాల ఉత్పత్తులను పెంచేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. డిమాండ్ కు సప్లైకు మధ్య వ్యత్యాసం తగ్గిస్తామని మంత్రి స్పష్టం చేశారు. పాడి రైతుల ప్రయోజనాలే ప్రజా ప్రభుత్వానికి ప్రాధాన్యత అని, విజయ డెయిరీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం కొనసాగిస్తుందని మంత్రి వాకిటి స్పష్టం చేశారు.



# కార్మిక కుటుంబానికి చెక్కు అందజేత



**సదాశివపేట. సెప్టెంబర్ 12. (సిరిన్యూస్)**

సదాశివపేట ఎల్లారం శివారులోని ప్రిన్స్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికునికి యాక్సిడెంట్లో మరణించడం జరిగింది. కంపెనీ మేనేజ్మెంట్ హెచ్ఆర్ హెడ్ రాజశేఖర్, ప్లాంట్ హెడ్ శశిమోల్ మోహన్ ముందుకు వచ్చి 11 లక్షల రూపాయల చెక్కును శనివారం నాడు కుటుంబ సభ్యులకు ఇవ్వడం జరిగింది. నిజాంపూర్ గ్రామానికి చెందిన రోల్లకాడి రవి ప్రిన్స్ కంపెనీలో విధులు నిర్వహించుకొని వస్తుండగా ఆగస్టు 19వ తేదీ నాడు చందాపూర్ చౌరస్తా వద్ద మిషన్ భగీరథ ఎయిర్ పైప్ కు బైకు స్కిడ్ అయ్యి ఎయిర్ పైపుకు తగిలి అక్కడికక్కడే మరణించడం జరిగింది. ప్రిన్స్ కంపెనీ మేనేజ్మెంట్ తో గ్రామస్తులు చర్చలు జరిపి మీ కంపెనీలో పని చేస్తున్న రోళ్ళకాడి రవి కుటుంబానికి వాళ్ళ భార్య లక్ష్మికి 11 లక్షల రూపాయలు ఇప్పియ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరి నర్సింలు, గ్రామ సర్పంచ్ తులసి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, శ్యామల, గోపాల్, బిజెపి నాయకులు సారా కృష్ణ, ధనుంజయ్, శ్రీనివాస్, సురేష్, శంకర్, అనంతకృష్ణ, కుటుంబ సభ్యులు నిజాంపూర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్వాడ తరలి వెళ్ళిన స్థానిక బ్రాహ్మణులు




**పెద్ద శంకరం పేట, సెప్టెంబర్ 12 , (సిరి న్యూస్):**

కర్ణాటక లోని ధార్వడ లో హయగ్రీవ స్వామి ఆలయ ప్రాంగణం లో జగద్గురువులు శ్రీ సత్యాత్మ తీర్థ మధ్వ మహా స్వామి వారి 31వ చాతుర్మాస్య దీక్ష వ్రతం గత నెల రోజులు గా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు పెద్ద శంకరం పేట నుంచి దూప దీప నైవేద్యం (డీ డీ ఎన్) అమలు చేస్తున్న బ్రాహ్మణులు తరలి వెళ్ళారు. లోక కల్యాణం కోసం స్వామి వారి చేతుల మీదుగా

ప్రతి రోజు మూల రాముల వారి పూజ, ప్రసాదం, తప్త ముద్ర ధారణ, ఇత్యాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హరి సర్వోత్తమా... వాయు జీవోత్తమా... అని భక్తుల నినాదాల తో ఆలయ ప్రాంగణ క్రిక్కిరిసి పోయింది. తెలంగాణ రాష్ట్ర డీ డి ఎన్ అర్చక సంఘం ఉపాధ్యక్షులు గుడి చంద్ర శేఖర్ ఆధ్వర్యం లో పెద్ద శంకరం పేట, నారాయణఖేడ్ కు చెందిన బ్రాహ్మణోత్తములు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

# సీ ఆర్ టీ అకాల మరణం



- **ఆర్థిక సహాయం అందించిన మిగిలిన సిబ్బంది**

**పటాన్ చెరు, సెప్టెంబర్ 12, (సిరి న్యూస్)**

గత నెలలో లో నారాయణఖేడ్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో పనిచేస్తూ అనారోగ్యం తో అకాల మరణం చెందిన తెలుగు సీ ఆర్ టీ శ్రీమతి సుగుణ కుటుంబ ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకొన్న తోటి సిబ్బంది తమకు తోచిన ఆర్థిక సహాయం అందించారు. సి ఆర్ టీ స్వప్న, తో పాటు జె ఏ సీ అధ్యక్షులు మధురనేని శేషాద్రి, ఏస్ ఎస్ ఏ సిబ్బంది అందరూ కలసి వారి కుటుంబానికి అండగా ఉండాలనీ బావించి చిరు సహాయం అంద జేశారు. ఎస్ ఎస్ ఏ లో పని చేస్తున్న అన్ని శాఖల, ప్రభుత్వ ఉపాధ్యాయుల సహకారం తో రూపాయలు 86, 340 రూపాయలను జమ చేసి, శుక్రవారం నాడు వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన ఉపాధ్యాయులకు, ఎస్ ఎస్ ఎస్ అన్ని శాఖల వారికి పేరు పేరునా శేషాద్రి ధన్యవాదాలు తెలిపారు.

# ఏడేళ్ల తర్వాత భారత్ కు చైనా అధ్యక్షుడు జిన్ పింగ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 :**

చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ భారత్ కు చేరుకున్నారు. 18వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు శనివారం న్యూఢిల్లీ కి వచ్చిన ఆయన.. దాదాపు ఏడేళ్ల తర్వాత భారత్ లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, జిన్పింగ్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరగనుంది. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో ఇరు దేశాల సంబంధాలపై కీలక చర్చలు జరిగే అవకాశం ఉంది. జిన్ పింగ్ తోపాటు చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు, పార్టీ కేంద్ర కార్యాలయ డైరెక్టర్ కై కీ, పొలిట్ బ్యూరో సభ్యుడు, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భారత్ వచ్చారు. ఈ విషయాన్ని చైనాలో భారత రాయబారి షూ ఫెయిహోంగ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

# ఆచరణాత్మక అభ్యాసానికి గీతం పెద్దపీట

- **అధునాతన మైక్రోకంట్రోలర్లు, మెషిన్ లెర్నింగ్ పై రెండు రోజుల కార్యశాల**

**పటాన్ చెరు, సెప్టెంబర్ 12, (సిరి న్యూస్):**




అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల డిమాండ్లను తీర్చడానికి ఇంజనీరింగ్ విద్యార్థులను సిద్ధం చేయడంలో ఆచరణాత్మక, పరిశ్రమఆధారిత అభ్యాసం యొక్క ప్రాముఖ్యతకు హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగా, స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ కు చెందిన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈఈసీఈ) విభాగం అధునాతన మైక్రోకంట్రోలర్లపై మెషిన్ లెర్నింగ్ అనే అంశంపై రెండు రోజుల వృత్తి నైపుణ్యాభివృద్ధి ఆచరణాత్మక కార్యశాలను విజయవంతంగా నిర్వహించింది. SANSI RF, కమ్యూనికేషన్ సిస్టమ్స్ సహకారంతో దీనిని ఏర్పాటు చేశారు. ఈ కార్యశాలలో 80 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇది వారికి అభివృద్ధి చెందుతున్న టైనీ మెషిన్ లెర్నింగ్ (TinyML) రంగంలో లీనమయ్యే, ఆచరణాత్మక అభ్యాస అనుభవాన్ని అందించింది. అనుభవపూర్వక అభ్యాసానికి అధిక ప్రాధాన్యతనిస్తూ రూపొందించిన ఈ కార్యక్రమంలో మెషిన్ లెర్నింగ్ ప్రాథమిక అంశాలు, TinyML, సెన్సార్ ఇంటర్ ఫేసింగ్, డేటా సేకరణ, డేటాసెట్ సృష్టి, మోడల్ శిక్షణ, మైక్రోకంట్రోలర్లపై మోడల్ అమలు, రియల్టైమ్ ఇన్ఫరెన్స్, హార్డ్ వేర్ ఇంటిగ్రేషన్ వంటి కీలక భావనలను వివరించారు. ఆచరణాత్మక శిక్షణలో భాగంగా, ఇందులో పాల్గొన్నవారు ఐదు ప్రాక్టికల్ ప్రాజెక్టులను విజయవంతంగా అభివృద్ధి చేసి, అమలు చేశారు. తద్వారా మైక్రోకంట్రోలర్ ప్లాట్ ఫారమ్లపై మెషిన్లెర్నింగ్ ఆధారిత అప్లికేషన్లను రూపొందించి, అమలు చేయడంలో విలువైన అనుభవాన్ని పొందారు. ప్రాజెక్టుఆధారిత విధానం, సెన్సార్ డేటా సేకరణ, డేటా సెట్ తయారీ నుంచి మోడల్ శిక్షణ, అమలు, హార్డ్ వేర్ అనుసంధానం, రియల్టైమ్ ఇన్ఫరెన్స్ వరకు గల పూర్తి మెషిన్ లెర్నింగ్ వర్క్ ఫ్లోను విద్యార్థులు అర్థం చేసుకోవడానికి వీలు కల్పించింది. ఈ కార్యశాల, సైద్ధాంతిక భావనలను వాస్తవ ప్రపంచ అనువర్తనాలతో అనుసంధానించడానికి, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎంబెడెడ్ సిస్టమ్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ), ఎడ్జ్ కంప్యూటింగ్ రంగాలకు సంబంధించిన ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి విద్యార్థులకు ఒక అవకాశాన్ని అందించింది. స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ప్రశాంత ఆర్. ముడిమేల ఈ చొరవను ప్రశంసించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, కార్యక్రమ నిర్వాహకుడు ఎం.నరేష్ కుమార్, సహ నిర్వాహకుడు డాక్టర్ ఎస్.కె. జానీ భాషా ఈ కార్యశాలను సమన్వయం చేశారు.

# గర్భిణీలకు రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ కిట్ల పంపిణీ!!

- **నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి!!**

**శివ్వంపేట సెప్టెంబర్ 12(సిరి న్యూస్ )**

శివ్వంపేట మండల కేంద్రంలో రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో గర్భిణీ మహిళలకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ గర్భిణీ మహిళలు ఆరోగ్యంగా ఉండేందుకు పోషకాహారం ఎంతో అవసరమని తెలిపారు. గర్భధారణ సమయంలో తల్లికి అవసరమైన పోషకాలు అందితే తల్లి ఆరోగ్యంతో పాటు శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడుతుందని పేర్కొన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన గర్భిణీలకు పోషకాహారాన్ని అందించడం అభినందనీయమని అన్నారు. రాజన్న ఫౌండేషన్ ద్వారా గర్భిణీ మహిళలకు న్యూట్రిషన్ కిట్లను అందించడం ద్వారా వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్నామని నిర్వాహకులు తెలిపారు. గర్భిణీలకు అవసరమైన పోషకాహారంపై అవగాహన కల్పించడంతో పాటు, ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని పులిమామిడి నవీన్ గుప్తా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

**స్పీకర్పై అనుచిత వ్యాఖ్యలకు నిరసన,,,,**

అనంతరం శాసనసభ స్పీకర్పై బీఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శివ్వంపేట మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై నిరసన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా బీఆర్ఎస్ తీరును ఖండిస్తూ నినాదాలు చేశారు. స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తులపై బాధ్యతాయుతంగా మాట్లాడాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని,ఇలాంటి చర్యలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.
నిరసన కార్యక్రమంలో శివ్వంపేట మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా, పిఎసిఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, మాధవరెడ్డి, సుధీర్ రెడ్డి,వేణుగోపాల్ రెడ్డి, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బుర్ర మురళి గౌడ్, మాజీ జెడ్పిటిసి లక్ష్మీకాంతం, కమలాపూర్ సింగ్,గోమారం సర్పంచ్ ఆంజనేయులు,దొంతి ఉపసర్పంచ్ బానగారి శ్రీనివాస్, వివిధ మండలాల సర్పంచులు, ఉపసర్పంచులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు





# వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి

- **వెల్దుర్తి ఎస్సై కరుణాకర్ రెడ్డి**

**వెల్దుర్తి,సెప్టెంబర్ 12, (సిరి న్యూస్ ):**



వెల్దుర్తి మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి పండుగ సందర్భంగా వెల్దుర్తి ఎస్సై కర్ణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వెల్దుర్తి పోలీస్ స్టేషన్ ఆవరణలో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక మండపాల నిర్వాహకులు, గ్రామ పెద్దలు, యువతతో సమావేశమై పండుగ నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై సూచనలు చేశారు. వినాయక చవితి నవరాత్రులు, నిమజ్జనం ఊరేగింపు సందర్భంగా డీజే సౌండ్ సిస్టమ్లకు ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. మండపాల వద్ద భద్రతా చర్యలు పాటిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. పోలీసులకు సహకరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా వేడుకలు నిర్వహించాలని ఎస్సై సూచించారు. యువత ఉత్సాహంగా పాల్గొంటూనే పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. అంతేకాకుండా వాట్సాప్ లాంటి
మధ్యమాలో రెచ్చగొట్టే పాటలు లేదా మాటలతో ఇంకొకరిని ఇబ్బందికరంగా చేయవద్దని వినాయక మండపాల వద్ద జూదం, మత్తు పదార్థాలు లాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లో వాడవద్దని వారు సూచించారు. అలాగే నిమజ్జన సమయంలో పోలీసు వారికి తెలియజేసి వారికి వినాయకులను పోవు దారిని తెలియజేస్తూ ముఖ్యంగా వృద్ధులు మహిళలు చిన్నపిల్లలకు ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చూసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు యువకులు మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులు

- **1,000 సహజ మట్టి విగ్రహాల ఉచిత పంపిణీ**

రామచంద్రపురం, సెప్టెంబర్ 12 (సిరి న్యూస్):

వినాయక చవితిని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఎస్4ఎస్ (సేవా ఫర్ సొసైటీ) ఆధ్వర్యంలో 1,000 సహజ మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా అందజేశారు. సంస్థ వ్యవస్థాపకుడు గొరుగంటి శ్రీధర్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. డీఎస్పీ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో హరిచంద్రరెడ్డి, కొల్లూరు సీఐ సైదీరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కొల్లూరు డబుల్ బెడ్రూమ్ హౌసెస్ ఫేజ్-1, ఏలియన్స్ స్పేస్ స్టేషన్ ఎదురుగా, తెల్లాపూర్ సర్కిల్ పరిధిలో ప్రజలకు విగ్రహాలను అందించారు. గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీల నివాసితులతో పాటు ఎస్4ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, రసాయన రంగులకు దూరంగా ఉండి సహజ మట్టి విగ్రహాలను వినియోగించాలని నిర్వాహకులు సూచించారు. పర్యావరణం, జల వనరుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పండుగ మన సంస్కృతి.. పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత అనే సందేశంతో చేపట్టిన కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.





# ఉద్యోగుల సమస్యలపై చర్చ

- బిహెచ్ఈఎల్‌ను సందర్శించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్



**రామచంద్రాపురం, సెప్టెంబర్ 12 (సిరి న్యూస్):** తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులతో కలిసి శనివారం బి హెచ్ఈఎల్ రామచంద్రాపురం యూనిట్‌ను సందర్శించారు. లింగంపల్లి చెక్‌పోస్ట్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బిహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులతో సమావేశమై వారి సమస్యలు, సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. ఉద్యోగులు తమ సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకురాగా, వాటిపై ఛైర్మన్ చర్చించారు. తర్వాత బిహెచ్ఈఎల్ యాజమాన్యంతో సమావేశమైన కమిషన్ ప్రతినిధులు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం, వారికి అందుతున్న ప్రయోజనాలపై చర్చించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం, కమిషన్ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బిహెచ్ఈఎల్ హైదరాబాద్ ఈడీ వై. శ్రీనివాసరావు, ఉన్నతాధికారులు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జ్యూట్ బ్యాగులతో పర్యావరణహిత గణపతి



**రామచంద్రాపురం, సెప్టెంబర్ 12 (సిరి న్యూస్):** త్రివేణి స్కూల్‌లో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతితో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టారు. జ్యూట్ బ్యాగులతో విద్యార్థులు రూపొందించిన పర్యావరణహిత వినాయక విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పర్యావరణానికి హాని కలిగించే పదార్థాలకు బదులుగా సహజసిద్ధమైన జ్యూట్‌ను ఉపయోగించి విగ్రహాన్ని రూపొందించారు. విద్యార్థులు పాటలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ వీరేంద్ర చౌదరి, సీఆర్ఓ సాయి నరసింహారావు, ప్రిన్సిపల్ భవాని, క్యాంపస్ ఇన్‌చార్జ్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రకృతి హితమే పండుగల పరమార్థం..



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 12 (సిరి న్యూస్):** పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. పటాన్‌చెరు గాంధీ థీమ్ పార్క్ సర్కిల్‌లో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రజలకు సుమారు 600 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. పండుగలను భక్తిశ్రద్ధలతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ జరుపుకోవాలని జీఎంఆర్ సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# హెల్త్ అవేర్నెస్ వాక్ ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది





- డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్

**వెల్దుర్తి,సెప్టెంబర్ 12, (సిరి న్యూస్):** వెల్దుర్తి పట్టణ కేంద్రంలో శనివారం, శ్రీ వెంకటేశ్వర నర్సింగ్ హోమ్ వారి ఆధ్వర్యంలో ఆర్ ఎక్స్పర్ట్ సూపర్ స్పెషాలిటీ డిజిటల్ క్లినిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్యం పై అవగాహన పెంపొందిస్తూ కొత్త ఉత్సాహాన్ని నింపింది. వ్యాధులు రాకముందే నివారించుకోవడం, గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయడం, సకాలంలో వైద్యులను సంప్రదించే అలవాటును ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని డి. ఆర్.పట్నాయక్ నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్దుర్తి లో వెంకటేశ్వర నర్సింగ్ హోమ్ ప్రాంగణంలో ఉన్న ఆర్ ఎక్స్పర్ట్ సూపర్ స్పెషాలిటీ డిజిటల్ క్లినిక్ ద్వారా హైదరాబాదుకు చెందిన ప్రముఖ స్పెషలిస్ట్ వైద్యుల సేవలను స్థానిక ప్రజలు తమ ప్రాంతంలోనే పొందవచ్చని నిర్వాహకులు వివరించారు. ఈ సందర్భంగా డి. ఆర్. పట్నాయక్ మాట్లాడుతూ, Expert టెలి మెడిసిన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాలో రిజిస్టర్ అయిన, జాతీయస్థాయిలో అవార్డు పొందిన డిజిటల్ ఆరోగ్య సంరక్షణ మాధ్యమం. ఆధునిక టెలి మెడిసిన్ సాంకేతికత ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు నిపుణుల వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే మా ప్రధాన లక్ష్యం"అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీజి, డి. ఆర్. పట్నాయక్, డాక్టర్.ch. శ్రీనివాస్ ( వెంకటేశ్వర నర్సింగ్ హోమ్), Rxpert బృందం పాల్గొని ఆరోగ్య సంరక్షణ ప్రాముఖ్యతను వివరించి, ప్రజలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**కొల్చారం సెప్టెంబర్ 12 (సిరి న్యూస్)** కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి గ్రామ శివారులోని ఏడుపాయల ఫస్ట్ బ్రిడ్జి వద్ద సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. చిన్నచింతకుంట గ్రామానికి చెందిన గొల్ల అనిల్ కుమార్ (22) తన స్నేహితులతో కలిసి స్కూటీ నం. TS08 HZ 2294పై ఏడుపాయల ఆలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా, సాయంత్రం సుమారు 17:00 గంటలకు ఏడుపాయల నుంచి ఏడుపాయల టీజంక్షన్ వైపు ప్రయాణిస్తున్న సమయంలో, అతివేగం మరియు నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్ల వాహనంపై నియంత్రణ కోల్పోయి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో గొల్ల అనిల్ కుమార్, తండ్రి పేరు: రమేష్, వయస్సు: 22 సంవత్సరాలు, కులం: గొల్ల, వృత్తి: ప్రైవేట్ ఉద్యోగం. తలకు తీవ్ర గాయమైంది. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య శ్రీమతి గ్యారంగుల అనిత, భర్త: అనిల్ కుమార్, వయస్సు: 20 సంవత్సరాలు, కులం: వడ్డెర, వృత్తి: గృహిణి, నివాసం: చిన్న చింతకుంట గ్రామం, ఆత్మకూర్ మండలం, వనపర్తి జిల్లా, ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొల్చారం పోలీసులు కేసు నమోదు చేసి, ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

# భారతీనగర్‌లో ఉచిత వినాయక విగ్రహాల పంపిణీ





- భక్తులకు విగ్రహాలు అందజేసిన మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రపురం, సెప్టెంబర్ 12 (సిరి న్యూస్):** వినాయక చవితిని పురస్కరించుకుని భారతీనగర్ డివిజన్‌లోని ఎల్ఐజీ వార్డు కార్యాలయంలో శనివారం ఉచిత వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి పాల్గొని భక్తులకు విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో, పర్యావరణహితంగా జరుపుకోవాలని కోరారు. ప్రతి కుటుంబం సంతోషంగా పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంతో ఉచితంగా వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సింధు ఆదర్శ్‌రెడ్డి కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో మంజూరు చేయించి నిర్మించిన వినాయక షెడ్‌ను సందర్శించారు. షెడ్ నిర్మాణానికి కృషి చేసినందుకు కాలనీ ప్రజలు ఆమెకు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, భక్తులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వినాయక విగ్రహాలను స్వీకరించారు.

# మట్టి గణేష్ ను ప్రతిష్టించండి. పర్యావరణాన్ని కాపాడండి.



**సదాశివపేట. సెప్టెంబర్ 12. (సిరిన్యూస్)** మట్టి గణపతి ప్రతిమ అందజేత పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం.మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడాలని మాజీ మినిస్టర్ హరీష్‌రావు, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ జై గణేష్ యూత్ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సకల విఘ్నాలను తొలగిస్తూ అన్ని ఆపదల నుంచి కాపాడాలని మనం గణపతిని పూజిస్తామని అన్నారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని. ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్, వినయ్ గౌడ్, మొహమ్మద్ ఫరూక్, సుభాన్ రెడ్డి, సాయి, తదితరులు పాల్గొన్నారు.



# సంస్కార్ విద్యాలయ లో హిందీ దివస్ వేడుకలు



**పెద్ద శంకరం పేట, సెప్టెంబర్ 12, (సిరి న్యూస్)** జాతీయ హిందీ దినోత్సవం సెప్టెంబర్ 14 ను పురస్కరించుకొని పెద్ద శంకరం పేట సంస్కార్ విద్యాలయ లో ముందస్తు గా హిందీ దివస్ ను ఘనంగా నిర్వహించారు. హిందీ మన జాతీయ భాష అని, మన దేశ సంగ్రతకు దోహదమైనదని అంతటి ప్రాముఖ్యత గల భాష మార్కుల కోసం ఒక సబ్జెక్ట్ లాగా కాకుండా మాతృ భాష లాగే నేర్చుకోవాలని ఉపాధ్యాయ బృందం చిన్నారులకు వివరించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు విద్యార్థులకు హిందీ భాష మీద ఉపన్యాసం, వ్యాస రచన పోటీలు, చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహించారు.. హిందీ పాటల పై చిన్నారుల చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపల్ కవితా గౌడ్ హిందీ ఉపాధ్యాయురాళ్లు అనితా, రమ్య శ్రీ తో పాటుగా మిగితా ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకుంటున్న శ్రీనివాస్ గౌడ్



- రమేష్ కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం..

**పాపన్నపేట్ సెప్టెంబర్ 12 సిరి న్యూస్ :** కష్టాల్లో ఉన్న కుటుంబాలకు నేనున్నానంటూ అండగా నిలవడంలో సీనియర్ నాయకులు ఏడుపాయల శ్రీనివాస్‌గౌడ్ ముందుంటున్నారు. నాగ్సన్‌పల్లి గ్రామానికి చెందిన కమ్మరికత్తి రమేష్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించి, మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపిన శ్రీనివాస్‌గౌడ్, వారి కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈకార్యక్రమంలో మంగలి సంతోష్, మల్కయ్య, సార దశరథ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ నగేష్

**పాపన్నపేట్ సెప్టెంబర్ 12 సిరి న్యూస్**



మెదక్ జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపియన్ డే కార్యక్రమంలో భాగంగా మెదక్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నేడు కుల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామం, పాపన్నపేట మండలంలోని లక్ష్మీనగర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అందిస్తున్న సేవలు, ఓటర్ల జాబితా పరిశీలన, ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహణ తీరును అదనపు కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న అభ్యంతరాలు, దరఖాస్తులు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో మ్యాపింగ్ కాని కేసులు (No Mapping Cases) ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలించి, సంబంధిత రికార్డులను అధికారులు, సిబ్బందితో కలిసి ధృవీకరించారు. ఓటర్ల జాబితా ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక ఓటరు కంపియన్ డే సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు అవసరమైన సమాచారం, సహాయాన్ని అందిస్తూ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట తాసిల్దార్ సతీష్ సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శిల్పారామంలో శాస్త్రీయ నృత్యం



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 12 (సిరి న్యూస్):**

మాదాపూర్ శిల్పారామంలో భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి.సింధూజ రామచంద్రన్ భరతనాట్యంలో కౌత్వం, దశావతారం, తిల్లాన ప్రదర్శించి మెప్పు పొందారు. ఏలూరు నట్యగురు హేమసుందర్ శయ్యజీ బృందం భజమానస, మండోదరి శబ్దం, బ్రహ్మాంజలి, తరంగం, దశావతార శబ్దం, ముద్దుగారే యశోద అంశాలు ఆడింది. మేఘన, భవజ్ఞ, దేదీప్య, హెత్విక, తేజస్వి, పూజిత, తాన్విక, సత్యశ్రీ వెల్లి, లాస్యశ్రీ తదితరులు రాణించారు.రాధామోహన్ శిష్యులు గణపతి కౌత్వం,నమశ్శివాయతే,జతిస్వరం, కృష్ణ కలయసఖి, ఓం నమో నారాయణ ప్రదర్శించారు.చంద్రిక, అద్విక, క్రిష్, ఆరాధ్య, దేవంశీ, నాగజాన్వీ, స్నిగ్ధ పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి జోన్‌లో పట్టణ ప్రణాళిక

- **అధికారుల భారీ బదిలీలు**

శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 12 (సిరి న్యూస్): సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని శేరిలింగంపల్లి జోన్ పట్టణ ప్రణాళికా విభాగంలో విస్తృత స్థాయిలో బదిలీలు జరిగాయి. సీఎంసీ కమిషనర్ జారీ చేసిన ఆదేశాల మేరకు అనేక సర్కిళ్లలో ఏసీపీలు, టీపీఎస్‌లు, టీపీవోల బాధ్యతలు మారాయి. శేరిలింగంపల్లి సర్కిల్ ఏసీపీగా పనిచేస్తున్న సురేందర్‌రెడ్డిని జీడిమెట్ల సర్కిల్ ఏసీపీగా బదిలీ చేశారు. నార్సింగి ఏసీపీ ప్రసీద్‌కు శేరిలింగంపల్లి ఇంఛార్జి ఏసీపీగా అదనపు బాధ్యతలు అప్పగించి, పటాన్‌చెరువు ఇంఛార్జి ఏసీపీ పదవి నుంచి రిలీవ్ చేశారు. జీడిమెట్ల ఏసీపీ రాణిని పటాన్‌చెరు సర్కిల్ ఏసీపీగా నియమించి, అమీన్ సర్కిల్ ఇంఛార్జి ఏసీపీ బాధ్యతలు కూడా అప్పగించారు. అమీన్‌పూర్ టీపీవో, ఇంఛార్జి ఏసీపీ ప్రసాద్‌ను కొంపల్లి ఇంఛార్జి ఏసీపీగా నియమించారు.జీడిమెట్ల టీపీఎస్ మచ్చేందర్‌ను మాదాపూర్ టీపీఎస్‌గా బదిలీ చేసి, ఆల్విన్ కాలనీ సర్కిల్ టీపీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు.చింతల్ టీపీఎస్ మధుకు జీడిమెట్ల సర్కిల్ అదనపు బాధ్యతలు ఇచ్చారు. గాజులరామారం టీపీఎస్ సరిత సేన్‌కు కొంపల్లి సర్కిల్ అదనపు బాధ్యతలు అప్పగించారు.నిజాంపేట్ సర్కిల్ టీపీఎస్ ముఖేష్ సింగ్‌ను మేడ్చల్ సర్కిల్‌కు బదిలీ చేశారు. నార్సింగి, పటాన్‌చెరు సర్కిళ్ల టీపీఎస్ రమేష్‌కు అమీన్ సర్కిల్ అదనపు బాధ్యతలు అప్పగించారు. అమీన్‌పూర్ టీపీబీవో రోహన్ ఠాకూర్ మెడికల్ లీవ్‌లో ఉండటంతో, ఆయన విధుల్లో చేరే వరకు రమేష్‌కే అదనపు బాధ్యతలు కొనసాగుతాయి.మేడ్చల్ సర్కిల్ డీఎం గ్రేడ్3 సాయితేజనును నిజాంపేట్ సర్కిల్‌కు బదిలీ చేసి, దుండిగల్ సర్కిల్‌లోనూ అదనపు బాధ్యతలు అప్పగించారు.ఈ మార్పులు జోన్‌లో పట్టణ ప్రణాళిక పనుల పర్యవేక్షణను బలోపేతం చేసేందుకు తీసుకున్న పాలనా చర్యగా అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



**పాపన్నపేట్ సెప్టెంబర్ 12 సిరి న్యూస్:**

అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు. కొత్తపల్లి గ్రామానికి చెందిన గుడ్డింగారి రాజు(25) ఆటో డ్రైవర్ గా పని చేస్తు జీవిస్తున్నాడు. కాగా శుక్రవారం ఉదయం సమయంలో పని ఉందని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు శుక్రవారం రాత్రి సమయంలో శానాయిపల్లి శివారులో రోడ్డుపై తలకు గాయాలతో పడి ఉన్నాడు.అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. రాజును ఎవరైనా హత్య చేసి ఉంటారా లేదా ఏదైనా వాహనం ఢీ కొట్టిందా అనేది తెలియాల్సి ఉంది.పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి మృతుడి తండ్రి సిద్ధిరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# దళిత స్పీకర్‌కు అవమానం చేస్తే సహించం





- **దళితుల ఆత్మగౌరవం-రాజ్యాంగ గౌరవం - న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తుంది**
- **దళితులు నడిచారని నేలను శుద్ధి చేయించిన దొర అహంకారాన్ని శుద్ధి చేయాలి**
- **బీఆర్ఎస్ తీరుపై కొల్చారం కాంగ్రెస్ నేతల మండిపాటు**
- **కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ* అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్**

**కొల్చారం, సెప్టెంబర్ 12 (సిరి న్యూస్)**

నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి ఆదేశాల మేరకు కొల్చారం మండల కేంద్రంలో శనివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్పీకర్ పై అనుచిత వాక్యాలు జుగుప్సా కరం నాలుగు కోట్ల ప్రజలకు అవమానం జరిగింది. సభాపతికి జరిగిన అవమానం.. సభ్య సమాజానికి జరిగిన అవమానం. అవమానకరంగా వాక్యాలు చేసిన బి ఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధు పై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కొల్చారం ఎస్సై మహమ్మద్ మోహినుద్దీన్ కు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా కొల్చారం మండల కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. స్పీకర్ పై జుగుప్సా కరమైన భాష ఉపయోగించడమేంటి? దళితులను మోసం చేసిన పార్టీ బిఆర్ఎస్ దళితుడిని సీఎం చేస్తానని, వారికి మూడు ఎకరాల భూమి ఇస్తామని, చెప్పి కెసిఆర్ మోసం చేశారు. బిఆర్ఎస్ ది దళిత వ్యతిరేక ఆలోచన దళిత వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్‌కుమార్‌ను తెలంగాణ శాసనసభ స్పీకర్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం నియమించి సామాజిక నిబద్ధతను చాటుకుందని అన్నారు. అయితే ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీలో స్పీకర్‌ను ఉద్దేశించి అనుచితంగా ప్రవర్తించడం దళిత సమాజాన్ని అవమానించడమేనని మండిపడ్డారు. దళిత సభాపతిని అవమానించినందుకు అందరి మనోభావాలు దెబ్బతిన్నాయి. స్పీకర్‌ను దూషించడాన్ని ఖండిస్తూ దళితులు డప్పుల తో నిరసన తెలిపారు. ఎక్కడ కుట్ర జరిగిందో.. అక్కడ డబ్బులు మోగించి నిరసన చేపట్టారు. ఫామ్ హౌస్కు చాలా దూరంలో డప్పు కొట్టారే తప్ప.. ఎవరినీ తిట్టలేదు. దాడి చేయలేదు. దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని మాత్రమే కోరారు. ఎర్రవల్లిలో దళితులు డప్పు కొడితే శుద్ధి చేస్తారా.. అసెంబ్లీ నిబంధనలను ఉల్లంఘిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరును ప్రజలు గమనిస్తున్నారని, దళిత స్పీకర్ ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. విధుల్లో ఉన్న మహిళా పోలీసు అధికారుల పట్ల ప్రతిపక్ష ఎమ్మెల్యేలు అనుచితంగా ప్రవర్తించడం, సిబ్బందిని నెట్టివేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు.

**ఘన్‌పూర్ ఆయకట్టుకు నీరందిస్తాం**

కొల్చారం, పాపన్నపేట పరిధిలోని ఘన్‌పూర్ ఆనకట్ట (వనదుర్గ ప్రాజెక్టు) కింద ఉన్న ఆయకట్టు రైతులకు సకాలంలో సాగునీరు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్, పెట్టుబడి సహాయం, రుణమాఫీ వంటి పథకాలను అమలు చేస్తూ రైతులకు అండగా నిలుస్తున్నామని అన్నారు.

**మండల అభివృద్ధికి ప్రాధాన్యం**

కొల్చారం మండలంలోని గ్రామాలకు లింక్ రోడ్లు, తాగునీటి వసతులు కల్పించడంతో పాటు అర్హులైన పేదలకు స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు కృషి చేస్తామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ముత్యం గారి గోవర్ధన్, మండల ప్రధాన కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎల్లుగారి శ్రీనివాసరెడ్డి, సర్పంచులు దేవన్న గారి శేఖర్, నాయిని వెంకట్ గౌడ్ (గజిని), చందాపురం మధుసూదన్ రెడ్డి, నెల్లి రాజు సంగమేశ్వర్, మాజీ ఎంపీటీసీ తుడుం రామకృష్ణ, గ్రామ అధ్యక్షులు ఆశన్న గారి శ్రీశైలం, మల్లేశం, వడ్ల విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 12 (సిరి న్యూస్):**

ప్రజల అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గంలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు, జేపీ కాలనీ, ముత్తంగి డివిజన్ల పరిధిలో రూ.4.06 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు తదితర సౌకర్యాలను దశలవారీగా కల్పిస్తున్నామని తెలిపారు.

అనంతరం స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీ, దేవ్ ప్రైమ్ విలాస్‌లో రక్షిత మంచినీటి సరఫరాను ప్రారంభించారు.

కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు గృహిణి అగ్నికి ఆహుతి

- **ఘటన స్థలంలోనే మృతి**
- **మృతురాలి మృతి చెందడం పై అనుమానం ?**

**కొల్చారం సెప్టెంబర్ 12,(సిరి న్యూస్)**

కొల్చారం మండలం పోతంశెట్టి పల్లి లో ఓ వివాహిత మహిళ ప్రమాదవశాత్తు శనివారం ఉదయం ఇంట్లో వంట చేస్తుండగా ఈ క్రమంలో బ్రాహ్మణపల్లి పారిజాత 50 ఇంట్లో వంట చేస్తున్న క్రమంలో చీరకు మంటలు అంటుకోవడంతో తీవ్ర గాయాలు కావడంతో మంటలు గమనించిన ఎరుగుపొరుగువారు వెంటనే అక్కడికి రావడంతో ఘటన స్థలంలోనే మృతి చెందినట్లు కొల్చారం పోలీసులు ఒక ప్రకటనలొ తెలిపారు విషయం తెలుసుకున్న కుమారుడు నరేష్ జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు ప్రమాదవశాత్తు పోతంశెట్టిపల్లి గ్రామానికి చెందిన బ్రాహ్మణపల్లి పారిజాత మృతి చెందడం పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి కొన్ని రోజుల క్రితం అదే కాలనీకి చెందిన కొంత బంగారం ఇచ్చినట్లు సమాచారం ఈ విషయంపై స్థానిక పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు దీంతో ప్రమాదవశాత్తు మృతి చెందడం పట్ల పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు

# ప్రతి చిన్నారి పేరుతో ఓ మొక్క నాటే కార్యక్రమం



**మునిపల్లి, సెప్టెంబర్ 12 (సిరి న్యూస్):**

మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని అల్లాపూర్ గ్రామ సర్పంచ్ అంకెన్‌పల్లి నారాయణ సూచించారు. ఇందులో భాగంగా గ్రామంలో పుట్టిన చిన్నారుల పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి, వాటికి నీరు పోశారు.

ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లవంటివని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు సహకరించాలని కోరారు. గ్రామంలో పుట్టిన ఆడపిల్ల అయినా.. మగపిల్లవాడైనా.. ప్రతి చిన్నారి పేరుతో ఒక మొక్కను నాటేలా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. నాటేందుకు సుమారు 25 రకాల పండ్ల మొక్కలను తీసుకొచ్చినట్లు వివరించారు. మొక్కలను సంరక్షిస్తే భవిష్యత్ తరాలకు వాటి ప్రయోజనం అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# "మట్టి వినాయకులను పూజిద్దాం – పర్యావరణాన్ని కాపాడుదాం"









- **పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత**
- **సిఐ రంగ కృష్ణ,**
- **మట్టి వినాయకులను పూజించాలి**
- **యస్.ఐ. రంజిత్ కుమార్**
- **మట్టి వినాయక విగ్రహాల పంపిణీ"**

**నర్సాపూర్ సెప్టెంబర్ 12 (సిరి న్యూస్)**

వినాయక చవితి పండగ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో శనివారం కరస్పాండెంట్ ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో గిరిదీపం ప్రైవేట్ హై స్కూల్ 125 మంది విద్యార్థులు,పాఠశాల సిబ్బంది, నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు ఈ సందర్భంగా నర్సాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రంగ కృష్ణ,పర్యావరణం ప్రాముఖ్యత పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ప్లాస్టిక్ పర్యావరణానికి హానికరమైన పదార్థాలు అని వీటితో విగ్రహాలు తయారు చేయడం నీటిలో గణేష్ నిమజ్జనం వలన నీరు కలుషితంమై పర్యావరణానికి హాని కలుగుతుందని మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించి వినాయక చవితిని భక్తి శ్రద్ధలతో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ పండగ జరుపుకోవాలని సూచించారు."మట్టి వినాయకుని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం" అనే సందేశంతో విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువత లో పర్యావరణ పరిరక్షణపై బాధ్యత పెరగాలని సమాజంలో పర్యావరణ రహితమైన వినాయక చవితి నిర్వహణకు అందరము కృషి చేయాలి అని అన్నారు అనంతరం సిఐ రంగ కృష్ణ, యస్.ఐ. రంజిత్ కుమార్,చేతుల మీదుగా 101 చిన్న మట్టి గణేష్ విగ్రహాలు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు

# గురుకులంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

- అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ..
- రేణికుంట్ల ప్రవీణ్ చేతుల మీదుగా కార్యక్రమం..
- భారీగా పాల్గొన్న తల్లిదండ్రులు, సిబ్బంది..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 (సిరి న్యూస్)**



బెల్లంపల్లి నియోజకవర్గంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల సీఓఈలో భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ దేశానికి అందించిన సేవలను, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పోషించిన కీలక పాత్రను గుర్తుచేశారు. విద్య, సమానత్వం, సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విద్యార్థులు అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. గురుకుల కళాశాల ఆవరణలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు ఆయన ఆలోచనలు, రాజ్యాంగ విలువలు నిత్యం గుర్తుండేలా చేయడంతో పాటు సామాజిక సమానత్వంపై అవగాహన పెంపొందించేందుకు దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి రాజేష్, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కళాశాల ప్రిన్సిపాల్ విద్యాసాగర్, ఉపాధ్యాయులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- వాగులో తేలిన మహిళ మృతదేహం
- ప్రమాదమా ప్రణాళికబద్ధమైన హత్యనా?

**అమీన్ పూర్ సెప్టెంబర్ 12 సిరి న్యూస్**

అమీన్ పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని గండిగూడెం కాలనీ పరిధిలోనీ వాగులో శనివారం జయమ్మ అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వాగులో మృతదేహం తేలియాడటాన్ని గమనించిన కాలనీవాసులు, వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.
ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వాగు నుంచి బయటకు వెలికి తీశారు. అనంతరం పంచనామ నిర్వహించి మృతికి గల పూర్తి కారణాలను తెలుసుకునేందుకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానికులు, కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని ఇది ప్రమాదమా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు వేగవంతం చేస్తామని తెలిపారు. కుటుంబీకుల అనుమానాలు, మహిళ అనుకోకుండా కాలుజారి పడిపోయిందా, లేక ఎవరైనా నెట్టివేసి హత్య చేశారా, అనే విషయమై స్థానికులు కుటుంబ సభ్యులు, తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.





# పట్టుదల గెలిచింది.. పీహెచ్‌డీ దక్కింది...









- 85వ స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పట్టా..
- పట్టుదలకు ప్రతిష్ఠాత్మక గుర్తింపు..
- ఉద్దండుల సమక్షంలో అరుదైన గౌరవం..
- యువతకు స్ఫూర్తిగా విజయగాథ..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 (సిరి న్యూస్)**

జీవితంలో ఎదురయ్యే ప్రతి అడ్డంకిని అధిగమించి, లక్ష్యం వైపు అలుపెరగని పోరాటం సాగించడమే నిజమైన విజయానికి నిదర్శనం. అలాంటి స్ఫూర్తిదాయక ప్రయాణానికి ఇప్పుడు అత్యున్నత గౌరవం దక్కింది. ఎన్నో సవాళ్లు, తీవ్ర ఒత్తిళ్లు, అనేక ఒడిదుడుకులు అడుగడుగునా ఎదురైనా, వెన్ను చూపకుండా, లక్ష్యంపై అచంచలమైన దృష్టితో సాగిన ఈ సుదీర్ఘ ప్రయాణం ఇప్పుడు అందరి నోళ్లలో నానుతోంది. పట్టుదల, నిరంతర కృషి, అలుపెరగని శ్రమకు తగిన ప్రతిఫలంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన డాక్టరేట్ (పీహెచ్‌డీ) పట్టాను సొంతం చేసుకోవడం ద్వారా ఈ విజయగాథ ఒక చరిత్రగా నిలిచిపోయింది..

**చిరస్మరణీయ ఘట్టం.. గర్వకారణమైన క్షణం..**

ఏళ్ల తరబడి సాగిన పరిశోధన, నిద్రాహారాలు మాని చేసిన శ్రమ, ఎన్నో అవాంతరాలను దాటుకుంటూ సాగిన ప్రయాణానికి తగిన ఫలితంగా, ఉస్మానియా విశ్వవిద్యాలయం అత్యంత వైభవంగా నిర్వహించిన 85వ స్నాతకోత్సవంలో వ్యాపార నిర్వహణ విభాగంలో పీహెచ్‌డీ పట్టాను అందుకోవడం అత్యంత గర్వకారణమైన, మరపురాని క్షణంగా నిలిచింది. ఈ చారిత్రాత్మక ఘట్టం కేవలం వ్యక్తిగత విజయం మాత్రమే కాదు, పట్టుదల ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చనే విషయానికి నిదర్శనంగా నిలిచింది. ఈ వార్త ప్రస్తుతం అన్ని వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారి, సోషల్ మీడియాలో సైతం చర్చనీయాంశంగా మారింది..

**ఉద్దండుల సమక్షంలో అరుదైన గౌరవం..**

ఈ చారిత్రాత్మక వేడుకకు తెలంగాణ గవర్నర్, ఉస్మానియా విశ్వవిద్యాలయ కులపతి శివ ప్రతాప్ శుక్లా అధ్యక్షత వహించగా, భారత్ బయోటెక్ వ్యవస్థాపకుడు, ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణ ఎం. ఎల్లా, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ మొలుగారం కుమార్ వంటి ప్రముఖుల సమక్షంలో డాక్టరేట్ పట్టా అందుకోవడం ఈ విజయానికి మరింత శోభను, గౌరవాన్ని తీసుకొచ్చింది. ఇంతటి ప్రతిష్టాత్మక వేదికపై, ఇంతమంది దిగ్గజాల సమక్షంలో పట్టా అందుకోవడం జీవితకాల అనుభూతిగా అభివర్ణించారు..

**కష్టాల కడలిని దాటిన ధైర్యసాహసాలు..**

ఈ ప్రయాణం అంత సాఫీగా సాగలేదు. ఆర్థిక ఒత్తిళ్లు, వ్యక్తిగత సవాళ్లు, పరిశోధనలో ఎదురైన అనేక సాంకేతిక ఇబ్బందులు, సమయపాలన కష్టాలు..ఇలా ఎన్నో ప్రతికూల పరిస్థితులు అడుగడుగునా అడ్డుపడ్డాయి. అయినప్పటికీ, ఏమాత్రం వెనుకంజ వేయకుండా, పరిశోధనపైనే సంపూర్ణ దృష్టి కేంద్రీకరించి, రాత్రింబవళ్లు శ్రమించి లక్ష్యాన్ని చేరుకోవడం నిజంగా అసాధారణమైన విషయం. ఈ పట్టుదల నేటి యువతకు, ముఖ్యంగా ఉన్నత విద్యనభ్యసించాలనుకునే విద్యార్థులకు గొప్ప స్ఫూర్తినిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు..

**అండగా నిలిచిన అభిమానులకు, కుటుంబానికి హృదయపూర్వక కృతజ్ఞతలు..**

ఈ ఘనవిజయం వెనుక ఒంటరి పోరాటం లేదు.. అడుగడుగునా అండగా నిలిచిన కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, మిత్రుల సహకారం, శ్రేయోభిలాషుల ఆశీర్వచనాలు ఉన్నాయని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తన సుదీర్ఘ ప్రయాణంలో ప్రతి దశలోనూ ధైర్యం చెప్పి, ముందుకు నడిపించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. వారి ప్రోత్సాహం లేకుంటే ఈ లక్ష్యాన్ని చేరుకోవడం అసాధ్యమయ్యేదని పేర్కొన్నారు..

**యువతకు స్ఫూర్తిదాయక సందేశం..**

కష్టపడేవారికి విజయం ఎప్పటికీ దూరం కాదని ఈ ఘటన మరోసారి రుజువు చేసింది. సవాళ్లు ఎదురైనప్పుడు వెనుకడుగు వేయకుండా, లక్ష్యంపై గురి పెట్టి పోరాడితే ఎంతటి కఠినమైన లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని ఈ విజయగాథ నిరూపించింది. ప్రస్తుతం ఈ స్ఫూర్తిదాయక కథనం జిల్లా వ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది..

# పేదల సేవలో నిరంతరం ఉంటా

- గ్రామీణ పేద ప్రజలకు నిరంతరం ఉచిత వైద్యం చేస్తాం
- తన తండ్రి బాటలోనే నా ప్రయాణం అంటున్న డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్

**వెల్దుర్తి, సెప్టెంబర్ 12, (సిరి న్యూస్ ):**



మానవతా సేవ, దాతృత్వం, సామాజిక బాధ్యతకు పెద్దపీట వేస్తూ శ్రీ వెంకటేశ్వర నర్సింగ్ హోమ్ అధినేత కీర్తిశేషులు చిప్ప నరసింహులు జ్ఞాపకార్థం గత కొంతకాలంగా వెల్దుర్తి మండల కేంద్రంలో అన్నదాన కార్యక్రమాలు, అలాగే ఉచిత వైద్య సేవలు అనేక సేవా కార్యక్రమాలను చేపడుతూ నిరంతరం సేవా స్ఫూర్తిని కొనసాగిస్తున్నారు డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ దంపతులు. శ్రీ వెంకటేశ్వర నర్సింగ్ హోమ్స్ సంస్థను స్థాపించి, పేదలు, నిరుపేదలు గా ఉన్నవారికి అండగా నిలుస్తూ వైద్యసేవ లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పేదలకు ఉచిత వైద్య సేవలు, అవసరమైన వారికి ఆపరేషన్లు, మందుల పంపిణీ, గర్భిణులకు అవసరమైన వైద్య సదుపాయాలు తక్కువ ఖర్చుతో కల్పించడం వంటి అనేక కార్యక్రమాలను చేపడుతూ పేదలకు డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ కుటుంబం భరోసాగా నిలుస్తోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య సేవలు పొందలేని వారికి సైతం అండగా నిలిచి, మానవతా వాది డాక్టర్ శ్రీనివాస్. అదేవిధంగా శ్రీ వెంకటేశ్వర నర్సింగ్ హోమ్స్ ఆసుపత్రి ద్వారా వైద్య సేవలను విస్తృతంగా అందిస్తూ, అనేక మంది పేదలు, నిరుపేదలు మరియు అవసరమైన వారికి వైద్యపరమైన సహాయాన్ని అందిస్తున్నారు. వైద్య రంగంలో సేవలతో పాటు సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్న వ్యక్తి డాక్టర్ శ్రీనివాస్. ఈ సందర్భంగా శనివారం తన తండ్రి జ్ఞాపకార్థం పలువురు నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందించారు. శ్రీ వెంకటేశ్వర నర్సింగ్ హోమ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్ అవేర్నెస్ వాక్ ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. అంటూ గ్రామస్తులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆదర్శ్, ఉప సర్పంచ్ శ్రావణ్ కుమార్, జిల్లా నాయకుడు శ్రీనివాస్ గౌడ్, శాకారం శ్రీనివాస్ గౌడ్, పలువురు వార్డు మెంబర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పుస్తకావిష్కరణ లో జ్ఞాపిక అందుకున్న మొగిలి మాల



**పటాన్ చెరు, సెప్టెంబర్ 12, (సిరి న్యూస్,)**

శనివారం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో, విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి హైదరాబాద్ లో కవి సమ్మేళనం కవిత్వ కార్యశాల నిర్వహించారు.
అందులో పాల్గొని , కళా రత్న, డాక్టర్ బిక్కీ కృష్ణ ప్రసిద్ధ కవి , భారతీయ సాంస్కృతిక అనువాద ఫౌండేషన్ అధ్యక్షులు వారి చేతుల మీదుగా ప్రబోధ చంద్రోదయం అనే పుస్తకం, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందుకున్న కవి, మొగలి మాల. మొగిలి మాల జిన్నారం మండల పరిధిలోని కొడుకంచి ఉన్నత పాఠశాల లో తెలుగు భాష ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందుకోవడం పట్ల పలువురు పాఠశాల ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

# మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో మైనార్టీ గురుకుల విద్యార్థుల ప్రతిభ



**జోగిపేట, సెప్టెంబర్ 12, (సిరి న్యూస్):**

జోగిపేటలో రెండు రోజుల పాటు నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఫ్ క్రీడల్లో మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచారు. ఈ పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ 17 కబడ్డీ పోటీల్లో మొదటి స్థానం, అండర్ 14 ఖోఖో పోటీల్లో మొదటి స్థానం, అండర్ 14 వాలీబాల్‌లో ద్వితీయ స్థానాన్ని పాఠశాలకు చెందిన విద్యార్థులు మంచి ప్రతిభను చూపి బహుమతులను గెలుచుకున్నారు. అందోలు మండల విద్యాధికారి బండి కృష్ణ క్రీడాకారులకు బహుమతులను ప్రధానం చేసారు. మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తారా సింగ్, కోఆర్డినేటర్ నర్మద, వార్డెన్ అబ్రార్, పీఈటీ అశోక్‌లు క్రీడాకారులను అభినందించారు. జిల్లా స్థాయిలో కూడా మంచి ఫలితాలు సాధించాలని వారు కోరారు.

# మట్టి గణపతుల పంపిణీ



**రామచంద్రాపురం, సెప్టెంబర్ 12 (సిరి న్యూస్):**

పర్యావరణ పరిరక్షణ కోసం వినాయక చవితికి మట్టి గణపతులను పూజించాలని తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్ అన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈకో ఫ్రెండ్లీ గణేశ్ విగ్రహాల పంపిణీలో భాగంగా శనివారం రామచంద్రాపురం శ్రీనివాస్‌నగర్ సండే మార్కెట్ సమీపంలోని కార్పొరేటర్ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుష్ప నగేష్ ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక ప్రజలకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణానికి హాని కలిగించని మట్టి విగ్రహాలతో వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ సర్కిల్ శానిటేషన్ సూపర్‌వైజర్ కేశవులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మల్లికార్జున్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులకు మోక్షం



- అధికారులతో మాట్లాడిన తాజా మాజీ కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 12 (సిరి న్యూస్):**

రామచంద్రాపురం డివిజన్ మల్లికార్జున్‌నగర్‌లో మధ్యలో నిలిచిపోయిన సీసీ రోడ్డు పనులను పూర్తి చేయించేందుకు తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ చర్యలు చేపట్టారు. శనివారం కాలనీలో పర్యటించిన ఆమె అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు త్వరగా ప్రారంభించాలని కోరారు. కాంట్రాక్టర్‌తోనూ మాట్లాడి పనులను వేగంగా
పూర్తి చేయాలని సూచించారు. సన్‌రైజ్ అపార్ట్‌మెంట్ నుంచి మల్లికార్జున్‌నగర్ కమాన్ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. ప్రజల సమస్యల పరిష్కారానికి పదవిలో ఉన్నా, లేకున్నా కృషి చేస్తామని పుష్పనగేష్ అన్నారు. అనంతరం కాలనీ వాసులు పుష్ప నగేష్, ఆమె భర్తను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రఘురాంరెడ్డి, కార్యవర్గ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ల పై కేసు నమోదు



- 3 ఆటోలను సీజ్ చేసిన పోలీసులు
- బస్టాండ్ ఎదురుగా ఆటోలు
- నిలపడంతో
- టాపిక్ నిబంధనలు పాటించాలి

**నర్సాపూర్ సెప్టెంబర్ 12 (సిరి న్యూస్)**

పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా వాహనదారులకు ఆటో డ్రైవర్లకు ప్రయాణికులను ఎక్కడ ఎక్కించుకోవాలి దింపాలి అనే విషయాలను పోలీస్ శాఖ తగు సూచనలు చేసినప్పటికీ పట్టణంలో బస్టాండ్ ఎదురుగా NH765D పై ఆటోలను నిర్లక్ష్యంగా నిలిపి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న 3 ఆటోల పై శనివారం పోలీసులు కేసులు నమోదు చేశారు.ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగా పోలీసుల సూచనలను పాటించాలి అని ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ ఈ విషయాన్ని బాధ్యతగా అర్థం చేసుకొని, మీకు కేటాయించిన ప్రదేశాలలో ఆటోలను నిలిపి, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని నర్సాపూర్ పోలీసులు తెలిపారు

# గణేశ్ నవరాత్రుల సందర్భంగా శాంతి కమిటీ సమావేశం



**తూప్రాన్ సెప్టెంబర్ 12 సిరి న్యూస్**

తూప్రాన్ గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు శనివారం తూప్రాన్ పట్టణంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తూప్రాన్ డీఎస్పీ నరేంద్ర గౌడ్ హాజరయ్యారు తూప్రాన్ తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఎస్ఐ గంగరాజు మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్ మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ విద్యుత్ శాఖ అధికారులు మున్సిపల్ కౌన్సిలర్లు ముస్లిం మత పెద్దలు గణేశ మండపాల నిర్వాహకులు తూప్రాన్ మండల ప్రజలు పాల్గొన్నారు డీఎస్పీ నరేందర్ గౌడ్ మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని శాంతిభద్రతలు మత సామరస్యం ట్రాఫిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులకు సహకరించాలని ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని సూచించారు.

# మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



**తూప్రాన్ సెప్టెంబర్ 12 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం పట్టణంలోని ప్రజలకు వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షనే ధ్యేయంగా తూప్రాన్ మున్సిపల్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణి చేసిన మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్ వైస్ చైర్మన్ కొక్కొండ సమత కాశి రెడ్డి కమిషనర్ రమేష్ కుమార్ చైర్మన్ రజిని రవీందర్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మట్టి గణపతులనే ప్రతిష్టించి పర్యావర నాన్ని పరిరక్షించాలని ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణం లో పండుగను జరుపుకోవాలని కెమికల్స్ తో తయారుచేసిన విగ్రహాలను చెరువులలో వేయడం వల్ల నీరు కలుషితమవుతుంది చెరువులో నీరు పశువులు తాగడం వల్ల వాటి ఆరోగ్యం పాడవుతుంది వాతావరణం కూడా కలుషితమవుతుందని ప్రజలకు వివరించారు మున్సిపల్ ప్రజలందరికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది మున్సిపల్ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రకృతిని ప్రేమిద్దాం.. మట్టి వినాయకుడినే పూజిద్దాం




- మట్టి విగ్రహాల పంపిణీ విశేష స్పందన
- డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్

**అమీన్పూర్ సెప్టెంబర్ 12 సిరి న్యూస్**

అమీన్పూర్ సర్కిల్ పరిధిలోనీ జర్నలిస్ట్ కాలనీలో శనివారం మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమం ఘనంగా చేపట్టారు. ముఖ్య అతిథుల చేతుల మీదుగా, డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి తో కలసి భక్తులకు మట్టి విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ... అమీన్పూర్ పరిధిలోని చెరువులు, జలవనరులు రసాయనరంగులతో కలుషితం కాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరు మట్టి వినాయకులనే పూజించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనగడ సాధ్యం అని ప్రతి ఇంట మట్టి గణపతిని ప్రతిష్టించి పార్యవరణ హిత చవితి జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మనోహర్, వెంకటరమణ, బాధిని శ్రీనివాస్, క్రాంతి, మున్నీ శ్రీనివాస్, భాను ప్రకాష్, పత్తి నరసింహ, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించాలి






- మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.
- డీజేలకు అనుమతి లేదు.. రాత్రి 10 గంటల వరకే స్పీకర్లు.
- మండపాల నిర్వాహకులతో పోలీసుల సమన్వయ సమావేశం.
- సోషల్ మీడియాలో వదంతులను నమ్మొద్దు.
- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.

**మెదక్ సెప్టెంబర్,12(సిరి న్యూస్)**

గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మెదక్ టౌన్, మెదక్ రూరల్ సర్కిల్ పరిధిలోని ఐదు పోలీస్‌స్టేషన్లకు చెందిన గణేష్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండపాల ఏర్పాటు, భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, శబ్ద కాలుష్యం, నిమజ్జనం తదితర అంశాలపై పోలీసు అధికారులు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రతి గణేష్ మండపాన్ని పోలీసు శాఖ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని అనుమతి పొందాలని తెలిపారు. విగ్రహం ఎత్తు, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, నిమజ్జనం తేదీ, ప్రదేశం తదితర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. మండపాల వద్ద 24 గంటలూ కనీసం ముగ్గురు వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చూడాలని, భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ తెలిపారు. మండపాల వద్ద టపాకాయలు కాల్చరాదని స్పష్టం చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా శబ్ద కాలుష్యాన్ని నియంత్రించాలన్నారు. రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లు వినియోగించాలని, మండపాల వద్ద డీజేలకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. పోలీసు అధికారులు సూచించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు, అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని ఎస్పీ కోరారు.ఈకార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు మహేష్, కృష్ణమూర్తి, సందీప్‌రెడ్డి, సీనియర్ సిటిజన్స్ సభ్యులు, గణేష్ మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# తూప్రాన్ పట్టణంలో ఆక్రమణదారులపై ఉక్కుపాదం

- తూప్రాన్ మున్సిపాలిటీ పోలీసుల సంయుక్త మెరుపు దాడి
- ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తే సహించేది లేదు
- ఫుట్ పాత్ వ్యాపారుల వద్ద అద్దెలు వసూలు చేసే యజమానులపైనా నిఘా
- పెట్టాం

**తూప్రాన్ సెప్టెంబర్ 12 సిరి న్యూస్**



తూప్రాన్ మున్సిపల్ పట్టణ పరిధిలో అక్రమ ఆక్రమణదారుల ఆటకట్టించేందుకు అధికారులు సమరశంఖం పూరించారు. జాతీయ రహదారిని, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి విక్రయాలు సాగిస్తున్న వ్యాపారులపై తూప్రాన్ ఎస్ఐ గంగరాజు, మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం పోలీస్, మున్సిపల్ బృందాలు సంయుక్తంగా మెరుపు దాడులు నిర్వహించాయి. ఈ ఆకస్మిక తనిఖీలతో అక్రమ వ్యాపారులు ఒక్కసారిగా పరుగులు తీశారు. రహదారులపై రాకపోకలకు తీవ్ర విఘాతం కలిగిస్తున్న ఆక్రమణలను అధికారులు అక్కడికక్కడే తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్, ఎస్ఐ గంగరాజు మాట్లాడుతూ... ఫుట్‌పాత్‌లు నడిచే బాటసారుల కోసమేనని, వాటిని ఆక్రమించి వ్యాపారాలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. జాతీయ రహదారిపై అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఫుట్‌పాత్‌లను అక్రమంగా ఆక్రమించిన చిన్న వ్యాపారుల నుంచి కొన్ని షట్టర్ల యజమానులు అక్రమంగా అద్దెలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని కమిషనర్ వెల్లడించారు. ఇలాంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే షాపు యజమానుల వివరాలు సేకరిస్తున్నామని, వారిపై కూడా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించడానికే ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పునరావృతమైతే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

# యువతి చదువుకునేందుకు భరోసా నింపిన జగ్గారెడ్డి

- జగ్గన్నను కలిస్తేనే భూమి సమస్య తీరుతుందని నమ్మిన విద్యార్థిని
- పది రోజులు కష్టపడి థ్రెడ్ ఆర్ట్‌తో చిత్రపటం గీసిన భవాని
- తమ భూ సమస్యను జగ్గారెడ్డికి వివరించిన వైనం
- చదువు కొనసాగించేందుకు సాయం చేయాలని వేడుకోలు
- కలెక్టర్ స్వయంగా మాట్లాడి తక్షణమే పరిష్కరిస్తానని భరోసా ఇచ్చిన జగ్గారెడ్డి



**సంగారెడ్డి, సెప్టెంబర్ 12 (సిరి న్యూస్):**

చదువుకోవాలనే తపనకు ఆర్థిక ఇబ్బందులు అడ్డొచ్చినా, పట్టుదలతో ముందడుగు వేసిన ఓ నిరుపేద విద్యార్థిని కథ అందరినీ ఆలోచింపజేస్తోంది. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం కప్పాడ్ గ్రామానికి చెందిన భవాని మోడల్ స్కూల్‌లో విద్యనభ్యసించింది. ప్రస్తుతం అసోసియేటెడ్ చార్టర్డ్ సర్టిఫైడ్ అకౌంటెంట్ కోర్సు చదువుతూ ఇప్పటికే ఫస్ట్ లెవల్ పూర్తి చేసింది. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితులు పూర్తిగా క్షీణించడంతో గత ఆరు నెలలుగా ఆమె చదువుకు దూరంగా స్వగ్రామంలోనే ఉంటోంది. కుటుంబానికి ఉన్న రెండున్నర ఎకరాల భూమి వివాదంలో చిక్కుకోవడం, అది రెవెన్యూ అధికారుల వద్ద పెండింగ్‌లో ఉండటంతో చదువు కొనసాగించాలా లేదా ఆపేయాలా అనే సందిగ్ధంలో పడింది. ఒకవైపు బీటెక్ పూర్తి చేసిన అక్క వివాహం, మరోవైపు తన చదువు కోసం ఆ భూమే ఆధారం కావడంతో సమస్యను ఎలాగైనా పరిష్కరించుకోవాలని భావించింది. తన సమస్యకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాత్రమే పరిష్కార మార్గం చూపగలరని గట్టిగా నమ్మిన భవాని, ఆయన్ను కలిసేందుకు సిద్ధమైంది. కలిసేటప్పుడు తనవంతుగా ఏదైనా ప్రత్యేక బహుమతి ఇవ్వాలని ఆలోచించి, చిన్నప్పటి నుంచే ఉన్న ఆర్ట్ ఆసక్తితో ఇంటర్నెట్ ద్వారా ఫీజు చెల్లించి మరీ 'థ్రెడ్ ఆర్ట్' (ధారలతో చిత్రం తయారీ) నేర్చుకుంది. ఏకంగా పది రోజుల పాటు శ్రమించి జగ్గారెడ్డి అద్భుతమైన చిత్రపటాన్ని తన చేతులతో రూపొందించింది. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చేర్యాల ఆంజనేయులు, చిమ్నాపూర్ ప్రకాష్, పాస్టర్ మోజెస్ సహకారంతో శనివారం తన తల్లిదండ్రులతో కలిసి జగ్గారెడ్డిని కలిసే అవకాశం దక్కించుకుంది. తాను స్వయంగా కష్టపడి తయారు చేసిన థ్రెడ్ ఆర్ట్ చిత్రపటాన్ని ఆయనకు బహుకరించింది. చిత్రం వెనుక ఉన్న అసలు కథ, కుటుంబ దీనస్థితిని తెలుసుకున్న జగ్గారెడ్డి చలించిపోయారు. రెవెన్యూ అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న రెండున్నర ఎకరాల భూమి సమస్యను పరిష్కరిస్తే తన చార్టెడ్ అకౌంటెంట్ చదువును మళ్లీ కొనసాగిస్తానని భవాని కన్నీటిపర్యంతమై వివరించింది. వెంటనే స్పందించిన జగ్గారెడ్డి.. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో స్వయంగా మాట్లాడి ఆమె భూమి సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతానని భరోసా ఇచ్చారు. చదువు మధ్యలో ఆపేయవద్దని, ధైర్యంగా ముందుకు సాగాలని ఆశీర్వదించారు. ఒక చిత్రపటం ఇచ్చేందుకు వెళ్లిన భవాని.. తన జీవితానికి సరికొత్త దారి చూపే భరోసాతో వెనుదిరిగింది. ఆమె చేతిలోని థ్రెడ్ ఆర్ట్ కేవలం బహుమతి మాత్రమే కాదని, దాని వెనుక ఉన్న పట్టుదల, బాధ్యత అందరికీ ఆదర్శప్రాయమని ఈ కలయిక నిలిచింది.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

- జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి.
- రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు
- డాక్టర్ సింగం శ్రీనివాసరావు

**రామాయంపేట, సెప్టెంబర్ 12 (సిరి న్యూస్)**



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గత మూడు ఏళ్లలో వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు జిల్లా చైర్మన్ లయన్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం రామాయంపేట పట్టణంలోని ప్రగతి రిసార్ట్లో జరిగిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, వరదలు వచ్చిన సమయంలో నిరుపేదలను ఆదుకోవడం, చలికాలంలో దుప్పట్ల పంపిణీ వంటి ఎన్నో రకాల కార్యక్రమాలు చేశామని తెలిపారు. వచ్చే నెలలో రెడ్ క్రాస్ సొసైటీకి ఎన్నికలు జరగనున్న దృష్ట్యా సేవా భావం కలిగిన వ్యక్తులను సభ్యులు ఎన్నుకోవాలని కోరారు. సభ్యుల సహకారంతో తాను చైర్మన్గా ఉండి, సేవా కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో తాను కూడా పోటీలో ఉంటున్నట్లు తెలిపారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సింగం శ్రీనివాసరావు మాట్లాడుతూ తనకు రెడ్‌క్రాస్ సేవల్లో తొమ్మిదేళ్ల అనుభవం ఉందన్నారు మెదక్ రెడ్‌క్రాస్‌కు కొత్త రూపు తీసుకురావడానికి శాయశక్తుల ప్రయత్నిస్తానని చెప్పారు. ఈ ఎన్నికల్లో తాను కూడా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. మెదక్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీని మరింత బలోపేతం చేసి రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లా శాఖగా అభివృద్ధి చేసే విధంగా ఆలోచిస్తాననీ, ఈ ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు ఆధునిక బ్లడ్‌బ్యాంక్, రెడ్‌క్రాస్ కార్యాలయం, విస్తృత వైద్య శిబిరాలు, రక్తదాన కార్యక్రమాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలతో పాటు సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాలని భావిస్తున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్‌లో తనకున్న తొమ్మిదేళ్ల అనుభవంతో పాటు కార్పొరేట్ రంగంలో సంపాదించిన నిర్వహణ అనుభవాన్ని ప్రజాసేవకు వినియోగించాలని ఆయన సంకల్పించారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసి మెదక్ జిల్లా ప్రజలకు రెడ్‌క్రాస్ ద్వారా మెరుగైన సేవలు అందించాలన్నదే తన ప్రధాన లక్ష్యమని మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు, మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు దేమే యాదగిరి తెలిపారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్ చంద్ర బోస్ మాట్లాడుతూ నిస్వార్థంగా సేవ చేయాలని అనుకునే వారు మాత్రమే ఎన్నికల్లో పోటీకి నిలబడాలని ఆయన సూచించారు. జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా మరిన్ని కార్యక్రమాలు చేస్తామని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి డి. జి. శ్రీనివాస శర్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు దామోదర్ రావు, ప్రసాద్, తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాతు సురేష్. పాతూరి సిద్ధ రాములు తదితరులు పాల్గొన్నారు

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.